మానేరు **జనత** ®
తెలుగు దినపత్రిక · ఇది జనం గొంతుక
24.5.2026 ఆదివారం Sunday · సంపుటి (Volume): 11 · సంచిక (Issue) : 27 · పేజీలు : 8 Pages : 8 · వెల : 2 · Published from : Karimnagar

**ఆఖరి మ్యాచ్‌లో పంజాబ్ అద్భుత విజయం**



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

# అమెరికాకు భారత్ కీలక భాగస్వామి

**భద్రత, వాణిజ్య,సాంకేతిక రంగాల్లో సహకారం**

**ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో చర్చలు**

భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికా-భారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని.. భారతీయ కంపెనీలు తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు.


04


# దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

**చిన్నారుల అంతర్థానంపై సుప్రీంకోర్టు ఆందోళన**

**కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయండి**

**అన్ని రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశం**


04



# గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

**జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం**

**గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం**

**కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు**

**తెలంగాణ క్యాబినెట్ నిర్ణయం**

**జనతా న్యూస్, హైదరాబాద్ :** వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం

మిగతా 2 లో

## యాదగిరిగుట్టలో సీఎం పర్యటన

**వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ**

# రెండోవిడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు

**ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పన మంజూరు**

**పాత ఇందిరమ్మ ఇళ్ల పూర్తికి నిధులు కేటాయింపు**

**జూన్ 1న కొరారి గ్రామంలో ఆదివాసీల ఇందిరమ్మ కాలనీ ప్రారంభం**

**కేబినెట్ నిర్ణయాలను వివరించిన మంత్రి పొంగులేటి**


03

రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 2 లక్షల 50 వేల మంది పేద కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ కుమార్‌లు మీడియాకు వివరించారు.

# పర్సంటేజీ అయితనే సినిమా ఆడుద్ది

**పెద్ది సినిమా నుంచే మొదలు పెడదాం**

**రెంటల్ సిస్టమ్ కాలం చెల్లిన విధానం**

**తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్**


02


02

# మాసాబ్ ట్యాంక్‌లో దారుణ ఘటన

**న్యాయవాదిని కారుతో ఢీకొట్టి చంపిన దుండుగుల**

**కారు నంబర్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు**

హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో న్యాయవాది ఖాజా మొహియుద్దీన్‌పై ప్రత్యర్థులు దాడికి తెగబడ్డారు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన న్యాయవాదిని దుండగులు కారుతో బలంగా ఢీకొట్టారు. పక్కా ప్లాన్‌తో న్యాయవాది కోసం వేచి చూస్తున్న దుండగులు.. ఖాజా మొహియుద్దీన్ బయటకు వచ్చిన వెంటనే అత్యంత వేగంగా వచ్చి ఢీకొట్టి పరారయ్యారు.

# యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

**దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు**

**ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు**

**19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**


03

దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు.



03

# వ్యాపార ఎదుగుదలకు తోడ్పడాలి

**చార్టర్డ్ అకౌంటెంట్లకు కేటీఆర్ హితవు**

చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగానూ ఎదగాలని ఆకాంక్షించారు. కృత్రిమ మేధను తమ వృత్తిలో భాగం చేసుకోవాలన్నారు.


## బక్రీద్ సెలవు 28కి మార్పు

**ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం**

02

## వరుసగా మూడోసారి పెట్రో ధరల పెంపు

**పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై 91 పైసల వాయింపు**



# బక్రీద్ సెలవు 28కి మార్పు

## ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్,మే24 :** తెలుగు రాష్ట్రాల్లో బక్రీద్(ఈద్ అల్-అధా) పండుగ తేదీ మారింది. దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఆలస్యం కావడంతో మే 28న బక్రీద్ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేశాయి. దీంతో ఆ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సహా విద్యాసంస్థలు, బ్యాంకులకు సెలవు ఉండనుంది. అయితే.. చంద్రుని దర్శనం ఆధారంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలో మాత్రం ఈ నెల 27న(బుధవారం) ఈ పండుగను జరుపుకోనున్నారు. తొలుత ప్రకటించిన దాని ప్రకారం.. మే 27న ఉండగా, దానిని మే 28 గురువారం నాటికి మారుస్తూ ఇరు తెలుగు రాష్ట్రాలు అధికారిక ఉత్తర్వులు జారీచేశాయి. వాస్తవానికి ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన పండుగ బక్రీద్.. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని చివరి నెల అయిన దుల్-హిజ్జా 10వ రోజు వస్తుంది. ఆ ప్రకారం ముస్లిం పండుగలు చంద్రదర్శనంపై ఆధారపడి ఉంటాయి. అయితే.. ఈసారి దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఒకరోజు ఆలస్యం కావడంతో పండుగ తేదీ మారినట్టు మతపెద్దలు ప్రకటించారు.

తెలంగాణ వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మైనారిటీ సంక్షేమ శాఖల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సిఫార్సులను పరిశీలించిన ప్రభుత్వం పండుగ సెలవును 28కి మార్చింది. మే 28న సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. మరోవైపు.. మే 28న సెలవు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీచేసింది.

# వరుసగా మూడోసారి పెట్రో ధరల పెంపు

## పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై 91 పైసల వాయింపు

**న్యూఢిల్లీ,మే24 :** పెట్రోల్ డీజిల్ ధరలు వరుసగా మూడోసారి పెరిగాయి. శనివారం పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం 91 పైసలు పెంచింది. 10 రోజుల్లో ధరలు పెంచటం ఇది మూడోసారి. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు విషయంలో ఆయిల్ కంపెనీలు ఓ ప్యాటర్న్ ఫాలో అవుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా చర్చ నడుస్తుంది. ఇప్పటి వరకు నాలుగు రోజులకు ఒకసారి పెంచటం జరిగింది. 15వ తేదీ తర్వాత 19.. ఆ తర్వాత 23వ తేదీ.. అంటే ధరల పెంపు మధ్య 4 రోజుల గ్యాప్ ఉండేలా చూసుకుంటున్నారు. ఇదే సమయంలో మరో ఆసక్తికరమైన అంశంపై సోషల్ మీడియాలో చర్చ నడుస్తుంది. గతంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును రాత్రి టైంలో అనౌన్స్ చేసేవాళ్లు.. రేపటి ఉదయం పత్రికల్లో ఆ వార్త వచ్చేసింది. ఇప్పుడు ఈ విధానం మారింది. అర్ధరాత్రి తర్వాత.. తెల్లవారుజామున ధరల పెంపు ప్రకటన చేస్తున్నారు. ఉదయం ఆరు గంటల సమయంలోనే ఈ వార్త జనానికి తెలుస్తుంది. పెంచిన ధరలు ఈ ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయని ప్రకటిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెంపు అనేది టీవీల్లో, సోషల్ మీడియాలో చూసి మాత్రమే జనం తెలుసుకుంటున్నారు.

# మాసాబ్ ట్యాంక్‌లో దారుణ ఘటన

## న్యాయవాదిని కారుతో ఢీకొట్టి చంపిన దుండుగుల

## కారు నంబర్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

**హైదరాబాద్,మే23 :** హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో న్యాయవాది ఖాజా మొహియుద్దీన్‌పై ప్రత్యర్థులు దాడికి తెగబడ్డారు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన న్యాయవాదిని దుండగులు కారుతో బలంగా ఢీకొట్టారు. పక్కా ప్లాన్‌తో న్యాయవాది కోసం వేచి చూస్తున్న దుండగులు.. ఖాజా మొహియుద్దీన్ బయటకు వచ్చిన వెంటనే అత్యంత వేగంగా వచ్చి ఢీకొట్టి పరారయ్యారు. కారు ఢీకొట్టిన వెంటనే న్యాయవాది గాల్లోకి ఎగిరి కిందపడ్డారు. దీంతో ఆయనకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు.. మొహియుద్దీన్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే ఆయన అప్పటికే మృతి చెందారు. న్యాయవాదిపై హత్యాయత్నం దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. న్యాయవాదిపై దాడి సమాచారం తెలుసుకున్న తోటి న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాజా మొహియుద్దీన్‌ను కారుతో ఢీకొట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇది న్యాయవ్యవస్థపైనే దాడి అని వారు అభివర్ణించారు. ఈ ఘటనపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాయవాదిపై దాడికి గల కారణాలు, ఆయనపై ఎవరు దాడి చేశారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కారు నంబర్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇకపోతే మాసబ్‌ట్యాంక్ వద్ద కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ కన్నుమూశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ న్యాయవాది తుదిశ్వాస విడిచారు. న్యాయవాది తన కారు వద్దకు వచ్చి వెనక సీట్లో బ్యాగు పెట్టి.. డ్రైవింగ్ సీట్‌లో కూర్చోబోతున్న సమయంలో ఒక్కసారిగా దుండగులు కారుతో అతివేగంగా దూసుకొచ్చి బలంగా ఢీకొట్టారు. క్షణాల్లోనే ఈ ఘటన చోటు చేసుకుంది. న్యాయవాదికి తీవ్రమైన గాయాలవడంతో వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే న్యాయవాది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చివరకు చికిత్స పొందుతూ మొయునుద్దీన్ ప్రాణాలు కోల్పోయారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. కారు నంబర్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

# పర్సంటేజీ అయితనే సినిమా ఆడుద్ది

## పెద్ది సినిమా నుంచే మొదలు పెడదాం

### రెంటల్ సిస్టమ్ కాలం చెల్లిన విధానం : తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్




**హైదరాబాద్,మే 24 :** తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ది సినిమా విడుదల చేయాలంటే తమకు పర్సెంటేజ్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమా అయినా పర్సంటేజ్ కావాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తేల్చి చెప్పింది. శనివారం తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ.. 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు, మూడు సార్లు చర్చలు జరిగాయి. హరిహర వీరమల్లు రిలీజ్ సమయంలో.. రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. 'కానీ, సంవత్సరం గడిచిపోయింది. పెద్ది సినిమాకు మాకు పర్సంటేజ్ కావాల్సిందే. మమ్మల్ని నిర్మాతలు రెచ్చగొడుతున్నారు. మొదట మూడు వారాలు అన్నారు.. ఇప్పుడు ఆరు వారాలు అంటున్నారు. పర్సెంటేజ్ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడిస్తాము. 120 మంది థియేటర్స్ ఓనర్లు దీనస్థితిలో ఉన్నారు. పర్సంటేజ్ సిస్టంను కావాలనే నిర్మాతలు లేట్ చేస్తున్నారు. మాకు పర్సెంటేజ్ విధానం కావాల్సిందే. అది ఎంత ఇస్తారో చెప్పండి. 10,15 ఏళ్ల కింద థియేటర్స్‌కి మంచి రెవెన్యూ ఉండేది. ఇప్పుడు ఎగ్జిబిటర్స్‌కి రెవెన్యూ రావడం లేదు. కానీ, నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తోంది'.. పర్సంటేజ్ విధానం కొత్త విషయం కాదు. అన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఉంది. కాబట్టి కూర్చుని పర్సంటేజ్‌ను తేల్చండి. అన్ని సినిమాల రిలీజ్ సాఫీగా జరుగుతుంది. మీటింగ్‌లో కూడా పర్సంటేజ్‌కు సైన్ చేస్తేనే పెద్ది రిలీజ్‌కు ఒప్పుకుంటామని చెప్పాము. సబ్ కమిటీలో మెంబర్స్‌గా ఉండి.. మాకు కావలసిన పర్సంటేజ్‌ను సాధించుకుంటాం. మెగాస్టార్ చిరంజీవి పిలిస్తే వెళతాం. పెద్దమనిషికి మా బాధలు చెప్పుకుంటాం. పర్సంటేజ్ సిస్టమే ఉండాలి. రెంటల్ మాట వద్దు' అని అన్నారు.

# గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

మొదటి పేజీ తరువాయి

తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్ న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# యాదగిరిగుట్టలో సీఎం పర్యటన

## వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ



**యాదగిరిగుట్ట,మే23 :** యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు.



# హరీష్ రావువి పగటి కలలు

## అధికారంలోకి రావడం కల్ల

## ఫ్యూచటర్ సిటీపై బాధ్యాతారాహిత్య ప్రకటన

## అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బిఆర్ఎస్

## మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,మే24 :** ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళ్తున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

# కుమారుడు ట్రంప్ జూనియర్ వివాహం

## ప్రస్తుత పరిస్థితుల్లో హాజరు కాలేనన్న ట్రంప్

**వాషింగ్టన్ :** ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి తాను హాజరుకాకపోవచ్చని పేర్కొన్నారు. ఆ వేడుకకు హాజరైనా.. హాజరుకాకపోయినా తప్పుడు వార్తలతో తనను చంపేస్తారని చమత్కరించారు. అందుకే వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని.. అయితే ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో అది కష్టంగా మారే అవకాశం ఉందని తెలిపారు. 48 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారాంతంలో తన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్‌ను వివాహం చేసుకోనున్నారు. ఈ వేడుక బహమాస్‌లో జరగనుంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ వివాహానికి సన్నిహితులను మాత్రమే ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ట్రంప్ జూనియర్ 2005లో వెనెసాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వీరి మధ్య విభేదాలు రావడంతో 13 ఏళ్ల తమ వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ 2018లో విడాకులు తీసుకున్నారు. వీరికి ఐదుగురు సంతానం. 2020లో ట్రంప్ జూనియర్‌కు ఫాక్స్‌న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో నిశ్చితార్థం జరగ్గా.. తర్వాత దానిని రద్దు చేసుకున్నారు. అనంతరం మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో ట్రంప్ జూనియర్ గతేడాది ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
ఆదివారం 24 మే 2026


# రెండోవిడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు

**ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున మంజూరు**

**పాత ఇందిరమ్మ ఇల్లు పూర్తికి నిధులు కేటాయింపు**

**జూన్ 1న కొరారి గ్రామంలో ఆదివాసీల ఇందిరమ్మ కాలనీ ప్రారంభం**

**కేబినేట్ నిర్ణయాలను వివరించిన మంత్రి పొంగులేటి**




**హైదరాబాద్,మే24 :** రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 2 లక్షల 50 వేల మంది పేద కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ కుమార్‌లు మీడియాకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు, గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందిస్తాం. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు చొప్పున నిధులు కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ రెండు నాటికి దాదాపు లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొరారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించాం. జూన్ 1వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రాష్ట్ర మంత్రులంతా అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొంటాం అని మంత్రి పొంగులేటి తెలిపారు. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ దఫాలుగా చేసిన సర్వేల ప్రకారం 15 వేల కుటుంబాలు గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ కుటుంబాల న్నింటికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలని రాష్ట్ర క్యాబినెట్ తీర్మానించింది. గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని క్యాబినెట్ నిర్ణయించింది. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు రూ.1000 కోట్ల నిధులకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్లు మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఖీఆఊలో చేరేందుకు తెలంగాణ డిస్కంలు తయారు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం పాఠశాలలతో పాటు అన్ని జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకూ ఉదయం అల్పాహారంతో పాటు పాలు అందించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని డిసిఎంఎస్‌లను మార్క్ ఫెడ్లో విలీనం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. తెలంగాణ రూరల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ హాకాలో విలినం చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూ సేకరణ, పునరావాసం, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు రూ.587 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తెలంగాణను 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అందుకే నెక్ట్స్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30ని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. దావోస్‌లో ఈ పాలసీని లాంఛనంగా ఆవిష్కరించాం అని తెపిపారు. ఈ పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలతో పాటు 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం. యువతకు పరిశోధన, తయారీ, డిజిటల్ హెల్త్, గ్లోబల్ ఇన్నోవేషన్ రంగాల్లో మంచి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటివరకు ఎక్కువగా తయారీ మీద దృష్టి ఉంటే, ఇక నుంచి విలువైన ఇన్నోవేషన్ మీద ఎక్కువ ఫోకస్ పెడతాం. రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ యూనిట్లను కూడా పరిశ్రమలుగా గుర్తించే విధంగా ఈ పాలసీలో మార్పు తీసుకొస్తున్నాం. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్లు తెలంగాణకు రావడానికి ఈ పాలసీ ఉపయోగపడుతుందని మంత్రులు వివరించారు.

# తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్

**వడదెబ్బకు 16 మంది మృతి చెందినట్లు గుర్తింపు**

**మృతుల కుటుంబాలకు 4లక్షల చొప్పున పరిహారం**

**పరిస్తితిపై అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష**

**హైదరాబాద్,మే23 :** రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వడగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ప్రజల ప్రాణ రక్షణెలి తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వడగాల్పులతో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని చెప్పుకొచ్చారు. ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. హీట్‌వేవ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండదెబ్బకు గురైన వ్యక్తులకు ఆయా ఆస్పత్రులు అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే తెలంగాణలో భానుడి భగభగలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండగా, 18కు పైగా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో అధికారులు 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లోనూ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి 43 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాలు తీవ్ర వడగాలుల ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ ప్రభావం ఆందోళనకరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అలసటగా ఉంటుంది, గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, వేడిగా ఉన్నప్పుడు ఎక్కువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. కండరాల నొప్పి ఉంటుంది. హీట్ ఇంజురీలో శరీర భాగాలు దెబ్బతినే అవకాశం ఉంది. కిడ్నీ, గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. హీట్ స్ట్రోక్ తీవ్రమైన సమస్య.. దీనిలో శరీర భాగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. దీని కారణంగా మెదడు పనితీరు దెబ్బతింటుంది. స్ట్రోక్ సంభవించవచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఈ వడదెబ్బ నుంచి తప్పించుకోవాలంటే.. శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లకపోవడం మంచిది. షుగర్, బీపీ పేషెంట్లు మెడికేషన్ సక్రమంగా తీసుకోవాలి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు బయట తిరగకపోవడమే మంచిది. అత్యవసర పరిస్థితిలో వెళ్లాల్సి వస్తే.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముదురు రంగు దుస్తులు కాకుండా తేలికపాటి లేత రంగు దుస్తులను ధరించాలి. ఆల్కాహాల్ శరీరంలోని నీటి శాతాన్ని తగ్గిస్తాయి. ఎండాకాలంలో మద్యానికి దూరంగా ఉండటం మంచిది. ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన నిమ్మరసం లాంటివి శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి భర్తీ చేస్తాయి. దోసకాయలు, పుచ్చకాయలు, దానిమ్మ, బత్తాయి లాంటి పండ్లు తీసుకోవాలి. వేసవిలో తేలికపాటి వ్యాయామాలు ఉదయం 8 గంటల్లోపే ముగించాలి. వడదెబ్బ లక్షణాలు కనిపించగానే చికిత్స అందించాలి. లేదంటే శరీరం పూర్తిగా నిర్జలీకరణం చెంది.. బీపీ, పల్స్ పడిపోయి కొన్నిసార్లు ప్రాణాలు పోవచ్చు.

# యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

**దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు**

**ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు**

**19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



**హైదరాబాద్,మే24 :** దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్ వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా ంఎ, ఎని వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు. భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమీకండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని

అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం-శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు. మైనింగ్, ఇంజనీరింగ్ వంటి కోర్సులపై యువత దృష్టి సారించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచనలు చేశారు.




## వ్యాపార ఎదుగుదలకు తోడ్పడాలి

**చార్టర్డ్ అకౌంటెంట్లకు కేటీఆర్ హితవు**

**హైదరాబాద్,మే24 :** చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగానూ ఎదగాలని ఆకాంక్షించారు. కృత్రిమ మేధను తమ వృత్తిలో భాగం చేసుకోవాలన్నారు. గచ్చిబౌలిలో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర అత్యంత కీలకమని.. ట్యాక్స్‌లు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో వారి అవసరం చాలా ఉందన్నారు. సీఏలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన సత్కరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల త్యాగాలను, కష్టాన్ని ఎప్పటికీ మరువకూడదని.. వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు.

## ధాన్యం కొనుగోళ్లలో పూర్తి నిర్లక్ష్యం

**రైతుల అగచాట్లు పట్టని ప్రభుత్వం: వేముల**

**నిజామాబాద్ :** పంట కొనుగోలులో దారుణంగా విఫలమైన ప్రభుత్వం అన్నదాతల ఆత్మహత్యలపై తప్పుడు లెక్కలు చెప్తున్నదని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి మండిపడ్డారు. ధాన్యం ఎక్కడా సక్రమంగా కొనగడం లేదన్నారు. నిజామాబాద్‌కు వస్తే రైతులు పడుతున్న అగచాట్లను చూపిస్తానని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో చనిపోయిన రైతులు పది మందిపైనే ఉన్నారని, కానీ ఒక్కరూ చనిపోలేదని మంత్రి అనడం సిగ్గుచేటని నిప్పులు చెరిగారు. 'పంటలు కొనక పోవడంతో గగ్గోలు పెడుతూ రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతులు ప్రాణాలు కోల్పోయినా నిస్సిగ్గుగా అబద్దాలు చెప్తున్నారని విరుచుకుపడ్డారు. అవసరమైతే ప్రభుత్వానికి రైతుల మరణాల వివరాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. మండుటెండల్లో రైతులు పంటలు అమ్మ కొనేందుకు పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాల్లోవివరాలు సేకరించాకనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళున్నానని స్పష్టంచేశారు. పంట కొనుగోలు సంక్షోభం, అన్నదాతలు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులను తెలుసుకుని మాట్లాడాలన్నారు. పంట కొనుగోలు సంక్షోభంపై చర్చించాలని, చర్యలకు ఆదేశించాలని అన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై రైతుల ధర్నా

**శాంతియుత ధర్నా చేస్తున్నా అరెస్ట్ చేస్తే ఎలా**

**ప్రభుత్వంపై మండిపడ్డ గజ్వేల్ బిఆర్ఎస్ నేత వంటేరు**

**మెదక్,మే23 :** రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తే పోలీసులు బలవంతంగా అరెస్టు చేస్తున్నారని గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి ఆరోపించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. వారికి మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నించారు. పోలీసులు దౌర్జన్యంగా రైతులను అరెస్టు చేసి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు గన్నీ బస్తాలు, లారీలు లేకపోవడంతో వడ్లు కల్లాల్లోనే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతుల ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు దౌర్జన్యంగా ధర్నా చేయకుండా బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## సెంట్రింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు

**వారి సమస్యలు పరిష్కరించాలన్న కవిత**

**హైదరాబాద్,మే23 :** సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. సెంట్రింగ్ కార్మికులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. శనివారం ఇందిరాపార్క్ వద్ద జరుగుతున్న గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ గుత్తేదారుల అసోసియేషన్ మహాధర్నాకు కవిత మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జనసేన రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రెండు రోజుల్లో సెంట్రింగ్ కార్మికుల నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించాలని కవిత డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే రెండు రోజుల తర్వాత తానే స్వయంగా ధర్నాలో కూర్చుంటానని స్పష్టం చేశారు. సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లు గొంతెమ్మ కోరికలు కావని.. న్యాయమైనవేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే కచ్చితంగా విద్య, వైద్యం అందిస్తామని కవిత స్పష్టం చేశారు.

## ఎపికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

**మీడియా సమావేశంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**హైదరాబాద్,మే24 :** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసమైనా రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఏపీ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆలోచన చేయాలని.. ఓటు ఎవరికో వేసి దేవుడిని ఏదో అడిగితే ఎవరూ ఏం చేయలేరని అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా సహా పలు అంశాలపై స్పందించారు. 'భక్తి అంటే నాది.. నేను రియల్ ఎస్టేట్‌లో సంపాదించిన డబ్బులతో సీతారాముల కల్యాణం చేస్తాను. దేశం 67 ఏళ్ల పాలనలో రూ.54 లక్షల కోట్ల అప్పు చేస్తే.. బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.1,047 లక్షల కోట్ల అప్పులు చేసింది. ఊహుల్ కుటుంబం అధికారం కోసం ఏనాడూ తాపత్రయపడలేదు. ఆయనది ఆస్తులు, ప్రాణత్యాగం చేసిన కుటుంబం. ప్రధాని పదవిని రాహుల్ త్యాగం చేశారు. అధికారం చేపట్టిన తర్వాత మోదీ చేసిన మంచి ఒక్కటి చెప్పండి' అని మండిపడ్డారు.

# దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

## బయటకు రావాలంటే భయపడుతున్న జనాలు

**న్యూఢిల్లీ:** దేశంలో భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు భగభగ మండుతున్నాయి. జనం ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టాలంటే భయంతో వణికిపోతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రానున్న వారం రోజులపాటు కూడా తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాలు సహా వాయవ్య, మధ్య, తూర్పు భారత్‌లోని పలు మైదాన ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అంచనావేసింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఐఎండీ వెల్లడించింది. విదర్భ, ఆంధ్రాలోని తీరప్రాంతం, యానాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ వడగాలులు వీచే అవకాశముందని తెలిపింది. శుక్రవారం ఉదయం దాదాపు 11 గంటల సమయానికి నమోదైన ఉష్ణోగ్రతల ప్రకారం.. ప్రపంచంలోనే 50 అత్యంత వేడి నగరాలన్నీ భారత్‌లోనే ఉన్నాయి. ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ ఈ గణాంకాలను వెల్లడించింది. జాబితాలోని సగం నగరాలు ఉత్తరప్రదేశ్‌లోనివే కావడం గమనార్హం. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలూ ఇందులో ఉన్నాయి.

# గ్రీన్ కార్డు జారీలో స్వల్ప సవరణలు

## భారతీయులకు ఊరటనిచ్చేలా ప్రకటన

**వాషింగ్టన్:** అమెరికాలో నివసిస్తున్న తాత్కాలిక వలసదారులు శాశ్వత నివాసం పొందే హక్కు కోసం అగ్రరాజ్యం ప్రవేశపెట్టిన గ్రీన్ కార్డ్ నిబంధనల్ని సడలించింది. ఈ నిబంధనల్లో కొన్ని మినహాయింపులు ఇస్తున్నట్టు ప్రకటించింది. తాజా సడలింపులతో భారతీయులకు ఉపశమనం లభించింది. అగ్రరాజ్యంలో తాత్కాలిక వీసాలపై నివసిస్తున్న భారతీయులు ఆందోళనను రేకెత్తించిన అనంతరం.. యునైటెడ్ స్టేట్స్ ఇమ్మిగ్రేషన్ అధికారులు ఇటీవల ప్రకటించిన గ్రీన్ కార్డ్ నిబంధనలను పాక్షికంగా సడలించారు. సవరించిన విధానం ప్రకారం.. వర్క్, స్టూడెంట్, పర్యాటక వీసాలపై ఉన్న దరఖాస్తుదారులు తమ స్వదేశాలకు వెళ్లి, అమెరికా రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్ ద్వారా గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే.. ఈ నిబంధనలు అందరికీ వర్తించవని యూఎస్‌సీఐఎస్ ప్రతినిధి జాక్ కహ్లర్ వెల్లడించారు. అమెరికా జాతీయ, ఆర్థిక ప్రయోజనాలే ప్రధానమనుకున్న వలసదారులకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఉంటుంది. గ్రీన్ కార్డ్ ఆశావహులు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా.. మా దేశానికి ప్రయోజనముందని భావిస్తే వాటిని పరిగణనలోకి తీసుకుంటాం. అలాంటప్పుడు వారు ప్రస్తుత నిబంధనల ప్రకారం కొనసాగేందుకు అనుమతిస్తాం. మిగిలినవారిని వారి స్వదేశానికి వెళ్లి దరఖాస్తు చేసుకోమని సూచిస్తాం' అని కహ్లర్ తెలిపారు. అయితే.. ఆ దరఖాస్తులు తమ దేశానికి ఏరకంగా ప్రయోజనం చేకూరుస్తాయి, వాటిని ఎలా నిర్ణయిస్తారనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. కొత్త నిబంధనల్లోని లోపాలను ఉపయోగించుకుంటూ ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసే అవకాశాలు తగ్గిపోతాయని ఆయన స్పష్టం చేశారు.

# మర్యాద, సంస్కారాలు భారత్ నుంచి నేర్చుకోండి

## అమెరికా విదేశాంగ మంత్రికి ఇరాన్ కాన్సులేట్ సూచన

**ముంబై:** అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత్ పర్యటనకు వచ్చిన నేపథ్యంలో ఇరాన్ వ్యంగ్యంగా స్పందించింది. ఇరాన్ ముంబై కాన్సులేట్ సోషల్ మీడియా వేదికగా రుబియోను ఉద్దేశిస్తూ 'భారతీయుల నుంచి కొంచెమైనా మర్యాద, సంస్కారం నేర్చుకోండి' అంటూ ఎక్స్ ఖాతాలో వ్యంగ్యంగా ఓ పోస్ట్ చేసింది. అమెరికా-భారత్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగు పరిచేందుకు మార్కో రుబియో ప్రస్తుతం పర్యటనకు వచ్చారు. యుద్ధం ముగింపు చర్చలు జరుగుతుతన్న ప్రస్తుత తరుణంలో అమెరికాకు చెందిన కొందరు నేతల డిమాండ్లు, ప్రవర్తనపై ఇరాన్ తీవ్ర ఆగ్రహంగా ఉంది. ఇరాన్ తమ డిమాండ్లకు తలొగ్గకుంటే మరోసారి సైనిక చర్యకు దిగుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. అమెరికా ఉపాధ్యక్షుడు, రక్షణ మంత్రి కూడా ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ అమెరికా విదేశంగా మంత్రికి చురక అంటించింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత్ పర్యటన తొలి రోజే ప్రధాని నరేంద్ర మోదీతో న్యూఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించారు. దాదాపు గంటకు పైగా సాగిన ఈ భేటీలో కీలక అంశాలు చర్చకు వచ్చినట్టు సమాచారం. అంతకు ముందు రుబియో కోల్‌కతాకు చేరుకుని మథర్ థెరిసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీ ప్రధాన కేంద్రాన్ని సందర్శించారు.

# బెంగుళూరులో కాక్రోచ్ జనతా పార్టీ

## నేడు మానవహారం అంటూ వెలసిన పోస్టర్లు

## అలాంటిదేమీ లేదంటూ పోలీసుల కొట్టివేత






**బెంగళూరు:** సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన 'బొద్దింకల జనతా పార్టీ' పేరుతో మే 24న బెంగళూరులో మానవహారం నిర్వహించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'బొద్దింకల జనతా పార్టీ కర్ణాటక' పేరుతో విడుదలైన పోస్టర్‌లో టౌన్ హాల్ సమీపంలో శాంతియుత మానవహారం చేపడతామని పేర్కొన్నారు. 'బొద్దింకల శక్తి ఆన్‌లైన్‌లోనే కాదు, వీధుల్లో కూడా ఉంది' అని పోస్టర్‌లో పేర్కొనడం చర్చనీయాంశమైంది. అయితే ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని బెంగళూరు పోలీసులు స్పష్టం చేశారు. మానవహారం నిర్వహించేందుకు ఏ వ్యక్తి, సంస్థ లేదా రాజకీయ పార్టీ నుంచి ఇప్పటివరకు దరఖాస్తు రాలేదని తెలిపారు. టౌన్ హాల్ పరిసరాల్లో అనుమతి లేకుండా గుమికూడవద్దని, సోషల్ మీడియాలో ఈ కార్యక్రమానికి సంబంధించిన సందేశాలను షేర్ చేయవద్దని హెచ్చరించారు. నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోలుస్తూ ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై వ్యంగ్యంగా స్పందిస్తూ 'బొద్దింకల జనతా పార్టీ' పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభమైంది. ఈ పేరుతో ప్రారంభమైన ఎక్స్ ఖాతా కొద్ది రోజుల్లోనే వైరల్‌గా మారింది. అనంతరం ఆ ఖాతా నిలిపివేయబడినప్పటికీ, ఇన్‌స్టాగ్రామ్‌లో సీజేపీకి భారీ స్థాయిలో ఆదరణ లభించింది. కొద్ది రోజుల్లోనే సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా 1.85 కోట్ల ఫాలోవర్లను సంపాదించి, ప్రధాన రాజకీయ పార్టీల అధికారిక పేజీలను అధిగమించింది. పుణెకు చెందిన అభిజీత్ దీప్కే అనే యువకుడు ఈ ఖాతాను ప్రారంభించారు. ఖాతా నిలిపివేసిన తరువాత తనకు ప్రాణహాని బెదిరింపులు వస్తున్నాయని ఆయన తెలిపారు.

# అమెరికాకు భారత్ కీలక భాగస్వామి

## భద్రత, వాణిజ్య,సాంకేతిక రంగాల్లో సహకారం

## ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో చర్చలు



**న్యూఢిల్లీ:** భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికా-భారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా- భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని.. భారతీయ కంపెనీలు తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న మార్కో రూబియో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. వైట్‌హౌస్‌ను సందర్శించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరఫున ఆయన మోదీని ఆహ్వానించారు. సేవాతీర్థ్ లో దాదాపు గంటకు పైగా ప్రధానితో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్‌కు ముడి చమురు సరఫరా చేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందన్నారు. అదే సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తన ఆధీనంలోకి తీసుకోవడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రధాని మోదీకి, ట్రంప్‌నకు మధ్య మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని రూబియో అన్నారు. వారిద్దరూ కేవలం తాత్కాలిక ప్రయోజనాల గురించే కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలపైనా దృష్టిపెడతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశంలో మండుతున్న ఎండల గురించి మాట్లాడుతూ.. వేడిగా ఉన్నందున తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించాలనుకుంటున్నానంటూ చమత్కరించారు. అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతో భేటీపై ప్రధాని మోదీ స్పందించారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతితోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలు తదితర అంశాలపై చర్చలు జరిపామన్నారు. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పని చేస్తామన్నారు. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించుకోవడానికి శాంతియుత చర్చలు జరపాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు.

# ప్రధాని మోడీతో రామ్మోహన్ కుటుంబం భేటీ

## జీవితాంతం గుర్తుండి పోయే మధుర క్షణం అంటూ పోస్ట్



**న్యూఢిల్లీ:** కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం కుటుంబంతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తల్లి ప్రధాన మంత్రికి మొక్కను బహుకరించారు. కుటుంబంతో కలిసి ప్రధాని మోదీని కలవటంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎక్స్‌లో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. ఆ పోస్టులో.. 'ఈ రోజు మా కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే ఓ భావోద్వేగ క్షణం. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కుటుంబ సమేతంగా కలిసే అదృష్టం కలగడం ఎంతో ఆనందంగా, గర్వంగా భావిస్తున్నాను'.. ఆయన అసాధారణ వ్యక్తిత్వం, ఆప్యాయత మా కుటుంబంలోని మూడు తరాలను ఒకేలా ఆకట్టుకుంది. ప్రజల హృదయాల్లో ఆయన ఎందుకు అపారమైన ఆదరణ పొందారో ఆ క్షణంలో మరింత స్పష్టంగా తెలిసింది. ప్రత్యేకంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే మహత్తర ఆలోచనకు ప్రేరణగా నా తల్లి ప్రధానమంత్రికి మొక్కను బహుకరించడం మా కుటుంబానికి ఎంతో మధురమైన, గర్వకారణమైన క్షణంగా నిలిచిపోతుంది. ఆయన చూపిన ప్రేమ, ఆప్యాయత, ఆశీస్సులకు మేమెప్పటికీ కృతజ్ఞులమే. మాతో గడిపిన అమూల్యమైన సమయానికి వారికి హృదయపూర్వక ధన్యవాదాలు' అని అన్నారు.

# దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

## చిన్నారుల అంతర్ధానంపై సుప్రీంకోర్టు ఆందోళన

## కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయండి

## అన్ని రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశం




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. పోలీసుల వద్ద ఉన్న క్రిమినల్ ట్రాకింగ్ డేటాబేస్, చైల్డ్ వెల్ఫేర్ అథారిటీల వద్ద ఉన్న 'విశాల్ వాసిల్య' డేటాబేస్ మధ్య సమన్వయం లేకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఐదు కీలక ఆదేశాలను జారీ చేసింది. దేశంలోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న చిన్నారుల డేటాబేస్‌లన్నింటినీ అనుసంధానం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. దీనివల్ల పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు , జిల్లా బాలల రక్షణ విభాగాలు చైల్డ్ కేర్ హోమ్‌ల మధ్య సమాచారం రియల్ టైమ్‌లో షేర్ అవుతుంది. చాలా జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని అన్ని ఏఊ్ఘజలను తగిన అధికారాలు, మౌలిక సదుపాయాలతో 4 వారాల్లోగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏదైనా చైల్డ్ మిస్సింగ్ కేసు నమోదైన వెంటనే.. అధికారులు ప్రాథమికంగా దానిని కిడ్నాప్ లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలి. దీనివల్ల ప్రొసీజర్ ఆలస్యం కాకుండా దర్యాప్తులో సీరియస్‌నెస్ వస్తుందని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆ కేసులో హ్యూమన్ ట్రాఫికింగ్ అనుమానాలు ఉంటే.. నిబంధనల ప్రకారం 4 నెలలు వేచి చూడకుండా వెంటనే కేసును బదిలీ చేయాలని స్పష్టం చేసింది. రక్షించిన లేదా రికవరీ చేసిన చిన్నారులను సాధారణంగా 24 గంటల్లోగా వారి కుటుంబాలకు అప్పగించాలి. ఒకవేళ ఆ నిర్దిష్ట చైల్డ్ ట్రాఫికింగ్ లేదా దోపిడీ వెనుక కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వస్తే తప్ప, మిగిలిన సమయాల్లో తక్షణమే తల్లిదండ్రుల వద్దకు చేర్చాలి. కుటుంబ సభ్యులపై అనుమానం ఉంటే ఆ బాధ్యతను చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు చూసుకోవాలి. రక్షించిన ప్రతి బిడ్డకు ఒకే గుర్తింపు ఉండేలా చూసుకోవడం, భవిష్యత్తులో వారి ఆచూకీని సులభంగా పర్యవేక్షించడం కోసం అవసరమైన అధికారిక రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ పక్రియలను వేగవంతం చేయాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లను కోర్టు ఆదేశించింది. తద్వారా ఐడెంటిటీ డూప్లికేషన్‌ను నిరోధించవచ్చని పేర్కొంది.

2011 సెప్టెంబరులో చెన్నైలోని విరుగంబాక్కం పరిధిలో 'కవిత' అనే చిన్నారి అదృశ్యమైంది. స్థానిక పోలీసులు, సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు ఈ కేసును ఆచూకీ లభించనిది గా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ ఇచ్చారు. దీనిపై తండ్రి జి. గణేలిష్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 మార్చిలో మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. చిన్నారి 2011 లో మిస్ అయింది కావున, 2013 లో వచ్చిన హోం శాఖ యాంటీ-ట్రాఫికింగ్ గైడ్‌లైన్స్ దీనికి వర్తించవని హైకోర్టు పేర్కొంది. ఈ తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. 'చిన్నారి ఆచూకీ లభించనంత కాలం, చైల్డ్ ప్రొటెక్షన్ గైడ్‌లైన్స్, యాంటీ-ట్రాఫికింగ్ ప్రొటోకాల్స్ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించి, దేశవ్యాప్తంగా ఉన్న మిస్సింగ్ చిన్నారుల సమస్యపై ఈ సమగ్ర ఆదేశాలు జారీ చేసింది. ఇక, ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదా వేసింది. ఆ సమయంలోగా అన్ని రాష్ట్రాలు, అధికారులు దీనిపై నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

# ట్విశా శర్మ మృతిలో వీడని మిస్టరీ

## ఆత్మహత్యకు ముందు సెలూన్‌ను సందర్శించినట్లు గుర్తింపు

**ముంబై:** దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన మాజీ మిస్ పుణె, ఎంబీఏ గ్రాడ్యుయేట్ ట్విషా శర్మ మృతి కేసుకు సంబంధించి పలు కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆమె ఇంట్లో ఉరివేసుకుని కనిపించడానికి కొన్ని గంటల ముందే ఓ సెలూన్ షాప్‌ను సందర్శించింది. సంబంధిత సీసీటీవీ ఫుటేజీ బయటకు వచ్చింది. సుమారు 3 గంటలసేపు సెలూన్‌లో ఉన్న ట్విషా.. హెడ్ మసాజ్, పెడిక్యూర్ చేయించుకున్నట్టు కనిపిస్తోంది. ట్విషా.. మే 12న మధ్యాహ్నం 3:12 గంటల ప్రాంతంలో సెలూన్‌లోకి వెళ్లి, సాయంత్రం 6:15 గంటలకు బయటకు వెళ్లారని సెలూన్ షాప్ యజమాని కిరణ్ పారిహర్ తెలిపారు. ఆ తర్వాతి రోజు ట్విషా అత్త గిరిబాలా సింగ్ ఆమె వివరాలపై పదే పదే ఆరా తీశారన్నారు. 'ట్విషా శర్మ.. మా సెలూన్‌కు తరచుగా వస్తుంటారు. గతంలోనూ ఆమె నాలుగైదుసార్లు వచ్చారు. అయితే.. ఈసారి సుమారు 9 నెలల విరామం తర్వాత వచ్చారు. మరుసటి రోజు ఉదయం గిరిబాల సింగ్.. ట్విషా సెలూన్‌కు వచ్చినప్పటి సీసీటీవీ ఫుటేజీ కావాలని ఫోన్ చేశారు' అని కిరణ్ చెప్పారు. తన కోడలు ట్విషా.. సెలూన్‌కు ఎప్పుడు వచ్చిందో, ఏ సమయంలో తిరిగి వెళ్లిందో స్పష్టంగా తెలపాలని గిరిబాలా సింగ్ కోరినట్టు షాప్ యాజమాని చెప్పారు. అలాగే ఆమె ఏ రకంగా డబ్బు చెల్లించారో.. ఆమె సెలూన్ సందర్శనకు సంబంధించి ఏదైనా ప్రూఫ్ లేదా రికార్డ్స్ కావాలని ఆమె పదే పదే అడిగారన్నారు. అయితే.. ట్విషా ఆ సమయంలో తనకు ఎలాంటి నగదు చెల్లించలేదని, గతంలోనే ప్రీపెయిడ్ ప్యాకేజీ తీసుకున్నారని పారిహర్ చెప్పారు. ఆ తర్వాత గిరిబాలా నుంచి మరోసారి ఫోన్ వచ్చిందని.. ట్విషా యోగక్షేమాల గురించి అడగ్గా.. ఆమె చనిపోయారని సమాధానమిచ్చినట్టు యజమాని చెప్పుకొచ్చారు. కాసేపటికే లాయర్ వస్త్రధారణతో కూడిన ఐదారుగురు వ్యక్తులు తన షాప్ వద్దకు వచ్చి.. తాము అడ్వకేట్లమని పరిచయం చేసుకుని సీసీటీవీ ఫుటేజీ తీసుకెళ్లారని పేర్కొన్నారు. అయితే.. తాము న్యాయవాదులమని చెప్పుకున్న ఆ బృందంలోని సభ్యుల గుర్తింపులు తెలియరాలేదు. దీంతో ట్విషా శర్మ మృతికేసు ఇంకా మిస్టరీగానే ఉంది. పోస్ట్‌మార్టం నివేదిక, ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు ప్రకారం.. ట్విషాది ఆత్మహత్యేనని పోలీసులు చెబుతున్నారు. ఈ కేసులో ఆమె కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు ట్విషా మృతదేహానికి రెండోసారి పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు మధ్యప్రదేశ్ హైకోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే.. పది రోజులుగా పరారీలో ఉన్న భర్త సమర్థ్ సింగ్‌ను ఎట్టకేలకు పోలీసులు మే 22న అరెస్ట్ చేశారు. అతణ్ని కోర్టులో హాజరుపరచనున్నారు.

# ఆఖరి మ్యాచ్‌లో పంజాబ్ అద్భుత విజయం

## నేడు రాజస్థాన్ ఓడితే ప్లేఆఫ్స్‌కు?
## శ్రేయాస్ అజేయ సెంచరీ
## అట్టడుగున లఖ్‌నవూ



లఖ్‌నవూ: ఎట్టకేలకు పంజాబ్ కింగ్స్ ఊపిరిపీల్చుకుంది. లీగ్ తొలి దశలో అందరికంటే ముందు దూసుకెళ్లిన ఈ జట్టు వరుసగా ఆరు పరాజయాలతో డీలా పడింది. ఇక ప్లేఆఫ్స్‌పై ఆశలు పెట్టుకోవాలంటే తమ ఆఖరి మ్యాచ్‌లో కచ్చితంగా గెలిచి తీరాల్సిన వేళ.. పంజాబ్ అదరగొట్టింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (51 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 101 నాటౌట్) అద్భుత సెంచరీతో తమ జట్టును రేసులో నిలిపాడు. శనివారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ 7 వికెట్లతో నెగ్గింది. దీంతో 15 పాయింట్లతో లీగ్ దశను ముగించింది. మ్యాచ్‌లో ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగులు చేసింది. ఇన్‌గ్లిస్ (44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 72), ఆయుష్ బదోని (18 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 43), అబ్దుల్ సమద్ (20 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 నాటౌట్) రాణించారు. చాహల్, యాన్సెన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 18 ఓవర్లలో 3 వికెట్లకు 200 పరుగులు చేసి గెలిచింది. ప్రభ్‌సిమ్రన్ (39 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 69) అర్ధసెంచరీ సాధించాడు. షమి 2 వికెట్లు తీశాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా శ్రేయాస్ నిలిచాడు.

### శతక భాగస్వామ్యంతో..:

ఛేదనలో శ్రేయాస్ అదరగొట్టాడు. అతడికి ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ చక్కటి సహకారం అందించడంతో పంజాబ్ ఎలాంటి ఇబ్బంది లేకుండా మ్యాచ్‌ను ముగించింది. అయితే ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ ప్రియాన్ష్ (0) వికెట్‌ను కోల్పోయింది. క్రీజులో ఉన్నంత సేపు వేగం కనబర్చిన కూపర్ (18) మూడో ఓవర్‌లో వెనుదిరిగాడు. ఈ ఇద్దరినీ షమి వెనక్కిపంపాడు. ఆ తర్వాత శ్రేయ్షస-ప్రభ్ జోరుకు లఖ్‌నవూ బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. ఆరంభం నుంచే శ్రేయాస్ ఫోర్లతో కదం తొక్కాడు. అటు ప్రభ్‌సిమ్రన్ వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు రాబట్టడంతో పవర్‌ప్లేలో జట్టు 65/2 స్కోరుతో నిలిచింది. పేసర్ అర్జున్ టెండూల్కర్ తన తొలి ఓవర్‌లో మూడు పరుగులే ఇచ్చినా తర్వాతి ఓవర్‌లో శ్రేయాస్ 4, ప్రభ్ 4,6తో 15 రన్స్ సమకూరాయి. 12వ ఓవర్‌లో 3 ఫోర్లతో ప్రభ్‌సిమ్రన్ 28 బంతుల్లో.. శ్రేయాస్ 33 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేశారు. 15వ ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్‌ను అర్జున్ అవుట్ చేసినా అప్పటికే పంజాబ్ గెలుపు ఖాయమైంది. ఈ జోడీ మధ్య మూడో వికెట్‌కు 140 రన్స్ లభించాయి. ఆ తర్వాత భారీ సిక్సర్లతో విరుచుకుపడిన శ్రేయాస్ 18వ ఓవర్ చివరి బంతికి సిక్సర్ బాది లీగ్‌లో తొలి శతకం సాధించడంతో పాటు మ్యాచ్‌ను విజయంతో ముగించాడు.

### ఆదుకున్న ఇన్‌గ్లిస్:

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ఇన్‌గ్లిస్ కీలకంగా నిలిచి, మధ్య ఓవర్లలో చక్కటి భాగస్వామ్యాలను నెలకొల్పాడు. ఇక బదోని ఆరంభంలో ధనాధన్ ఆటను ప్రదర్శించగా.. చివర్లో అబ్దుల్ సమద్ జట్టుకు గౌరవప్రదమైన స్కోరందించాడు. ఓపెనర్ మార్ష్ స్వదేశానికి వెళ్లడంతో అర్షిన్ కులకర్ణికి అవకాశమిచ్చారు. తొలి ఓవర్‌లోనే ఇన్‌గ్లిస్ నాలుగు ఫోర్లతో చెలరేగాడు. కానీ అర్షిన్ (0), పూరన్ (2) వరుస ఓవర్లలో వెనుదిరిగారు. అటు తొలి నాలుగు ఓవర్లలో జట్టు స్కోరు 24/2 మాత్రమే ఉండగా, బదోని గేరు మార్చాడు. ఐదో ఓవర్‌లో 4,4,6,4తో 18 రన్స్.. తర్వాతి ఓవర్‌లో 4,6,6,4తో 24 రన్స్ రాబట్టడంతో పవర్‌ప్లేలో ఎల్ఎస్‌జీ ఒక్కసారిగా 66/2 స్కోరుకు చేరింది. కానీ అతని దూకుడును స్పిన్నర్ చాహల్ అడ్డుకున్నాడు. ఏడో ఓవర్‌లో కీపర్ ప్రభ్‌సిమ్రన్ మెరుపు వేగంతో స్టంప్ చేయడంతో బదోని నిరాశతో వెనుదిరిగాడు. మూడో వికెట్‌కు 49 పరుగులు సమకూరాయి. అప్పటివరకు నిదానం కనబర్చిన ఇన్‌గ్లిస్ బ్యాట్ ఝుళిపించాడు. వైశాక్ ఓవర్‌లో 4,6.. అర్ష్‌దీప్ ఓవర్‌లో 6,4,4తో 28 బంతుల్లో ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. పంత్ (26) ఎప్పటిలాగే నిరాశపర్చాడు. 17వ ఓవర్‌లో సమద్ 6,4తో జోరు చూపినా.. అదే ఓవర్‌లో ఇన్‌గ్లిస్ వెనుదిరిగాడు. అనంతరం పట్టు బిగించిన పంజాబ్ బౌలర్లు తర్వాతి 12 బంతుల్లో పది పరుగులే ఇచ్చి.. ముకుల్ (1) వికెట్‌ను తీశారు. చివరి ఓవర్‌లో మాత్రం సమద్ వరుసగా 6,4,4తో 17 రన్స్ రాబట్టడంతో స్కోరు 200 దరిదాపుల్లోకి రాగలిగింది. ఎనిమిదో నెంబర్ బ్యాటర్‌గా బరిలోకి దిగిన సచిన్ తనయుడు అర్జున్ టెండూల్కర్ (5 నాటౌట్) ఎల్‌ఎస్‌జీ తరఫున అరంగేట్రం చేశాడు.

### నాలుగో బెర్త్ ఎవరిదో? సస్పెన్స్‌కు నేడు తెర

ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో తొలి మూడు బెర్త్‌లు ఖరారయ్యాయి. మిగిలిన నాలుగో స్థానం కోసం రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ పోటీపడుతున్నాయి. తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో లఖ్‌నవూపై గెలిచిన పంజాబ్ మొత్తం 15 పాయింట్లతో ఆశలు సజీవంగా నిలబెట్టుకొంది. ఈ సస్పెన్స్‌కు ఆదివారం రాజస్థాన్, కోల్‌కతా మ్యాచ్‌లతో తెరపడనుంది. 14 పాయింట్లతో ఉన్న రాజస్థాన్, తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ముంబైపై నెగ్గితే.. మొత్తం 16 పాయింట్లతో నేరుగా ప్లేఆఫ్స్ బెర్త్ దక్కించుకొంటుంది. అప్పుడు పంజాబ్, కోల్‌కతా జట్లు ఎలిమినేట్ అవుతాయి. ఒకవేళ రాజస్థాన్ ఓడితే.. అంతే సంగతులు. రేసు పంజాబ్, కోల్‌కతా మధ్యలో సాగుతుంది. 13 పాయింట్లతో ఉన్న కోల్‌కతా.. తన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో నైట్‌రైడర్స్ భారీ తేడాతో గెలిస్తే పాయింట్లను సమం చేయడంతోపాటు నెట్‌రన్ రేట్‌లో పంజాబ్‌ను వెనక్కు నెట్టే అవకాశం ఉంటుంది. ఇక, 12 పాయింట్లతో సాంకేతికంగా రేసులో ఉన్న ఢిల్లీ.. పంజాబ్ విజయంతో టోర్నీ నుంచి అవుటైంది.



# విరాట్ కోహ్లీపై నెటిజన్లు ఫైర్!

హైదరాబాద్ వేదికగా ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్ మధ్య జరిగిన మ్యాచ్ వన్‌సైడెడ్‌గా సాగినా గ్రౌండ్‌లో జరిగిన డ్రామా మాత్రం చర్చకు దారితీస్తోంది. కోహ్లీ బ్యాటింగ్ చేసినప్పుడు హెడ్ కవ్విస్తూ కామెంట్స్ చేశాడు. అప్పుడే విరాట్ సీరియస్ అయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా హెడ్ షేక్ హ్యాండ్ ఇస్తే పట్టించుకోకుండా విరాట్ వెళ్లిపోయాడు. ఇప్పుడు దీన్నే నెటిజన్లు తప్పుబడుతున్నారు. ఇది అహంకార పూరితమైన ప్రవర్తన అని కామెంట్స్ చేస్తున్నారు. ఉప్పల్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. ఓపెన్ అభిషేక్ శర్మ(56) ఇషాన్ కిషన్(79) మెరుపు ఆరంభాన్ని ఇచ్చారు. చివర్లో హెన్రిచ్ క్లాసెన్ (51) తన స్టైల్‌లో ఇన్నింగ్స్ ముగించాడు. బెంగళూరు బౌలర్లు హైదరాబాద్ బ్యాటటర్లను అడ్డుకోవడంలో విఫలమయ్యారు. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు ఇన్నింగ్స్ సమయంలో అసలు డ్రామా మొదలైంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ క్రీజులో ఉన్నప్పుడు చాలా దూకుడుగా కనిపించాడు. వరుసగా ఫోర్లు బాదిన తర్వాత కోహ్లీ ఎస్ఆర్‌హెచ్ ప్లేయర్ ట్రావిస్ హెడ్‌ను ఉద్దేశించి వచ్చి బౌలింగ్ చేయ్ అన్నట్టు కామెంట్ చేశాడు. దీనికి సమాధానంగా హెడ్ కేవలం చిరునవ్వుతోనే బదులిచ్చాడు. అయితే ఈ మాటల యుద్ధం కోహ్లీకి కలిసి రాలేదు. కేవలం 15 పరుగులు మాత్రమే చేసి అవుట్ అయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టింది." వచ్చాడు, బౌలింగ్ చేశాడు, వికెట్ పడగొట్టి వెళ్లిపోయాడు" అంటూ క్యాప్షన్ ఇచ్చింది. నిజానికి ట్రావిన్స్ హెడ్ బౌలింగ్‌కు వచ్చి ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ వికెట్ తీశాడు. కోహ్లీ హెడ్‌ను బౌలింగ్ చేయమని సవాల్ చేసినందున ఈ పోస్టు కోహ్లీని ఉద్దేశించిందేనని అభిమానులు భావిస్తున్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా కోహ్లీ కోపం తగ్గలేదు. పెవిలియన్ నుంచి వస్తూ అందరికీ షేక్ హ్యాండ్ ఇచ్చాడు కోహ్లీ. కానీ ట్రావిన్స్ హెడ్‌తో చేతులు కలపకుండా పక్కకు తప్పుకొని వెళ్లిపోయాడు. దీనికి హెడ్ కూడా షాక్ అయ్యి నవ్వి ముందుకెళ్లిపోయాడు. దీనిపై నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మైదానంలో జరిగిన విషయాలను ఇలా సీరియస్‌గా తీసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. రేపో మాపో రిటైర్ కాబోతున్నా కూడా మెచ్యూరిటీ రాలేదా అని ఎద్దేవా చేస్తున్నారు. మరికొందరు కోహ్లీ అహంకారపూరితంగా వ్యవహరించారని అంటున్నారు. ఆ వ్యక్తి యాటిట్యూడే అలా ఉంటుందని, నచ్చితే మాట్లాడుతాడు లేకుంటే అసలు పట్టించుకోడని అంటున్నారు. ఈ మ్యాచ్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో బెంగళూరు విఫలమైంది. దీంతో ఎస్ఆర్‌హెచ్ 55 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆర్సీబీ తరఫున వెంకటేష్ అయ్యర్ 44 పరుగులు, రజత్ పాటిదార్ 56 పరుగులు, కృనాల్ పాండ్యా 41 పరుగులు చేశాడు. ఈ ఓటమి బెంగళూరుకు పెద్దగా నష్టం చేయలేదు. మెరుగైన రన్‌రేటు కారణంగా పాయింట్ల పట్టికలో ఆర్సీబీ టాప్2లో ఉంది. నేరుగా క్వాలిఫైయర్ 1కు అర్హత సాధించింది. క్వాలిఫైయర్ 1లో గుజరాత్‌టైటాన్స్‌తో తలపడనుంది.


# చరిత్ర సృష్టించిన హెన్రిచ్ క్లాసెన్



సౌతాఫ్రికా మాజీ బ్యాటర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ అరుదైన ఘనత సాధించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 600 పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. శుక్రవారం ఉప్పల్ వేదికగా ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌లో 51 పరుగులు చేయడం ద్వారా ఈ మైలురాయిని అందుకున్నాడు. ఈ నేపథ్యంలో ఓ టీ20 టోర్నమెంట్‌లో 4వ స్థానం లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్ చేస్తూ 600కి పైగా పరుగులు చేసిన తొలి క్రికెటర్‌గా క్లాసెన్ చరిత్ర సృష్టించాడు. ఆర్‌సీబీ మ్యాచ్‌కు ముందు హెన్రిచ్ క్లాసెన్ 4వ స్థానం లేదా అంతకంటే తక్కువ స్థానంలో బ్యాటింగ్ చేస్తూ 13 ఇన్నింగ్స్‌లలో 555 పరుగులు సాధించాడు. ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌లో 4వ స్థానంలో ఆడిన క్లాసెన్ కేవలం 24 బంతుల్లోనే మెరుపు వేగంతో 51 పరుగులు చేసి ఈ టోర్నమెంట్‌లో 600 పరుగులను పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలోనే రిషబ్ పంత్‌ను అదిగమించాడు. ఐపీఎల్ 2018లో పంత్ 11 ఇన్నింగ్స్‌లలో 579 పరుగులు చేశాడు. ఈ పరుగులు నాలుగు లేదా నాలుగు కంటే దిగువన స్థానాల్లో బ్యాటింగ్ చేస్తూ సాధించాడు.

# రజత్ పాటిదార్ అరుదైన ఘనత

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పాటిదార్ అరుదైన ఘనత సాధించాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగంగా బంతుల పరంగా 100 సిక్సర్లు కొట్టిన భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. శుక్రవారం ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో మ్యాచ్‌లో హర్షల్ పటేల్ పటేల్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టి ఈ ఘనతను సాధించాడు.ఐపీఎల్‌లో 100 సిక్సర్లు పూర్తి చేయడానికి పాటిదార్‌కు 933 బంతులు బంతులు అవసరం అయ్యాయి. ఇంతకముందు ఈ రికార్డు శివమ్ దూబె పేరిట ఉంది. అతడు 100 సిక్సర్లు కొట్టేందుకు 992 బంతులు తీసుకున్నాడు. ఇక ఓవరాల్‌గా ఐపీఎల్‌లో అత్యంత వేగంగా 100 సిక్సర్లు కొట్టిన ఆటగాళ్ల జాబితాలో పాటిదార్ మూడో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో ఆండ్రీ రస్సెల్ అగ్రస్థానంలో ఉండగా.. ఆ తరువాతి స్థానంలో నికోలస్ పూరన్ ఉన్నాడు. ఇక ఈ మ్యాచ్‌లో 39 బంతులు ఎదుర్కొన్న రజత్ పాటిదార్.. 6 ఫోర్లు, 1 సిక్స్ సాయంతో 56 పరుగులు చేశాడు.





# 200+ స్కోర్లు సాధించిన జట్టుగా సన్‌రైజర్స్ ప్రపంచ రికార్డు

ఉప్పల్ వేదికగా శుక్రవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్‌హెచ్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. ఈ క్రమంలో ఓ టీ20 టోర్నమెంట్‌లో ఓ సీజన్‌లో అత్యధిక సార్లు 200 ప్లస్ పరుగులు సాధించిన జట్టుగా చరిత్ర సృష్టించింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ ఇప్పటి వరకు 9 సార్లు 200 ప్లస్ పరుగులు చేసింది.ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ బ్యాటర్లు పరుగుల వరద పారిస్తున్నారు. ఈ క్రమంలో కోల్‌కతా నైట్‌రైడర్స్, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్‌పై రెండేసి సార్లు, ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై ఒక్కోసారి 200కి పైగా పరుగులు సాధించింది.

# లేడీ ఫ్యాన్‌కు 'సారీ' చెప్పిన రోహిత్ శర్మ



రోహిత్ శర్మ అంటే అభిమానులకు ఎప్పుడూ ప్రత్యేకమే. అలాగే అభిమానులంటే కూడా రోహిత్?కు స్పెషలే. మరోసారి దీనిని హిట్?మ్యాన్ నిరూపించుకున్నాడు. ఇంతటీ బడా స్టార్ క్రికెటర్ అయినప్పటికీ, తాజాగా ఓ లేడీ ఫ్యాన్‌కు రోహిత్ 'సారీ' చెప్పాడు. తనను కలవలేకపోయాననని ఏడుస్తూ బాధపడుతున్న ఓ యువతి కోసం రోహిత్ వీడియో సందేశం పంపించాడు. మళ్లీ కోల్‌కతాకు వచ్చినప్పుడు ఆ అమ్మాయిని తప్పకుండా కలుస్తానంటూ వీడియోలో చెప్పుకొచ్చాడు. దీంతో ఆ అమ్మాయి ఆనంధానికి అవుధుల్లేకుండా పోయాయి!కోల్‌కాతా ఈడెన్ గార్డెన్స్ వేదికగా ముంబయి రీసెంట్‌గా కేకేఆర్‌తో మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్ సందర్భంగా రోహిత్‌ను కలవాలని ఓ లేడీ ఫ్యాన్ స్టేడియానికి వెళ్లింది. హిట్‌మ్యాన్‌ను కలిసేందుకు కొన్ని గంటల నుంచి వెయిట్ చేస్తున్నానని, అతడని కలవడమే తన డ్రీమ్ అని చెప్పింది. అయితే డ్రెస్సింగ్ రూమ్ నుంచి ప్లేయర్లు ఒక్కొక్కరు వస్తుండగా రోహిత్ కోసం ఆత్రుతగా ఎదురుచూసింది. అతడు రాగానే 'రోహిత్ భాయ్', 'రోహిత్ భాయ్' అంటూ గట్టిగా అరిచింది. అయితే క్రౌడ్ శబ్దం వల్ల రోహిత్ ఆమెను పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. అంతే ఒక్కసారిగా ఆ యువతి ఏడ్చేశింది. ఈ మొత్తం సన్నివేశాన్ని పక్కనే ఉన్న ఆమె బంధువు వీడియో రికార్డ్ చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో రోహిత్? దాకా చేరింది. అయితే తనను కలవలేకపోయానన్న బాధతో ఆ అమ్మాయి ఏడవడం రోహిత్?ను కలచివేసినట్లుంది. దీంతో ఆమెకు సారీ చెబుతూ హిట్?మ్యాన్ ఓ వీడియో చేశాడు. 'హాయ్, జినియా! ఈడెన్ గార్డెన్స్?లో నిన్ను కలవలేకపోయినందుకు నన్ను క్షమించు. నీ వీడియో చూశాను. నాకూ బాధేసింది. అయితే క్రౌడ్ ఎక్కువగా ఉండడం వల్ల కొన్నిసార్లు ఎవరు పిలుస్తున్నారో గుర్తుపట్టడం కష్టంగా ఉంటుంది. నేనూ అలాగే మిస్ అయినట్లు ఉన్నాను. కానీ, నెక్ట్స్ ఈడెన్ గార్డెన్స్?కు వచ్చినప్పుడు మాత్రం నిన్ను కచ్చితంగా కలుస్తాను' అని వీడియో షేర్ చేశాడు. ఈ వీడియో ఓ అభిమాని ద్వారా సదరు యువతికి చేరింది. తన వీడియోకు రోహిత్ రెస్పాన్స్ ఇవ్వడంతో హ్యాపీగా ఫీల్ అయ్యింది. మహిళా అభిమానికి సారీ చెబుతూ రోహిత్ చేసిన వీడియో వైరల్ అయ్యింది. ఆయన రేంజ్? స్టార్ అభిమానికి సారీ చెప్పడంతో హిట్‌మ్యాన్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. రోహిత్ తన అభిమానులను ఎప్పుడూ నిరాశ పర్చడని, అతడి బంగారం అంటూ పోస్టులు షేర్ చేస్తున్నారు. ఇక ప్రస్తుత ఐపీఎల్? సీజన్?లో ముంబయికి ఇంకా ఒక మ్యాచే మిగిలింది. ఆదివారం (మే 24) మధ్యాహ్నం 3.30 గంటలకు రాజస్థాన్ రాయల్స్?తో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్?కు ముంబయి వాంఖడే స్టేడియం వేదిక కానుంది. ఇది ముంబయికి పెద్దగా అవసరం లేకున్నా, రాజస్థాన్?కు మాత్రం కీలకమైన మ్యాచ్. ప్లేఆఫ్స్?కు చేరుకోవాలంటే ఈ మ్యాచ్?లో తప్పక నెగ్గాల్సిందే! ప్రస్తుతం 14 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ 16 పాయింట్లతో బెర్త్ ఖరారు చేసుకుంటుంది. ఒకవేళ ఓడితే పంజాబ్ కింగ్స్, కోల్?కతా నైట్?రైడర్స్?కు ఛాన్స్ ఉంటుంది.రోహిత్ ఈ మ్యాచ్?లో బరిలో దిగనున్నాడు. ఇప్పటిదాకా 8 మ్యాచ్?లు ఆడిన హిట్?మ్యాన్ 283 పరుగులు చేశాడు. ఇందులో రెండుసార్లు 50ం స్కోర్లు నమోదు చేశాడు. ఇక ఆఖరి మ్యాచ్?లో రాజస్థాన్?పైనా భారీ ఇన్నింగ్స్?తో చెలరేగిపోవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఈ మ్యాచ్ తప్పితే మళ్లీ వచ్చే ఏడాదే రోహిత్ టీ20ల్లో కనిపిస్తాడు.



# అనిరుధ్‌తో లవ్‌లో కావ్య మారన్

## త్వరలోనే వెడ్డింగ్ అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఓనర్ కావ్య మారన్‌కు సోషల్ మీడియాలో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో ఆమె హావభావాలు, రియాక్షన్స్ తరచూ వైరల్ అవుతూ అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపును సంపాదించాయి. అభిమానులు ప్రేమగా 'కావ్య పాప' అని పిలుచుకునే ఆమెకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కావ్య మారన్ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అంతేకాదు, ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో ఆమె పెళ్లి జరగబోతుందనే వార్తలు పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ప్రచారం కొత్తది కాదు. గత ఏడాది నుంచే కావ్య మారన్, అనిరుధ్ మధ్య సాన్నిహిత్యం ఉందంటూ సోషల్ మీడియాలో పుకార్లు వినిపించాయి. ముఖ్యంగా ఇద్దరూ న్యూయార్క్‌లో కలిసి కనిపించారనే వార్తలు రావడంతో డేటింగ్ రూమర్స్ మరింత ఊపందుకున్నాయి. అప్పటి నుంచి వీరిద్దరి గురించి అనేక కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడు మరోసారి కొత్త ప్రచారం తెరపైకి వచ్చింది. కొన్ని మీడియా కథనాల ప్రకారం, ఇరువురి కుటుంబ సభ్యులు ఈ వివాహానికి అంగీకారం తెలిపారని, విదేశాల్లో వివాహం జరిపించే అవకాశాలపై చర్చలు జరుగు తున్నాయని సమాచారం. వివాహం అనంతరం చెన్నైలో ఘనంగా రిసెప్షన్ నిర్వహించే ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయనే ప్రచారం నడుస్తోంది. ఇదిలా ఉండగా మరో ఆసక్తికర విషయం కూడా చర్చనీయాంశమైంది. అనిరుధ్‌కు కుటుంబ సంబంధాలు ఉన్న సినీ ప్రముఖులు ఈ వివాహం కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారనే కథనాలు తమిళ మీడియా వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు కావ్య మారన్ క్రీడా, వ్యాపార వ్యవహారాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఈ వివాహ వార్తలపై అటు కావ్య మారన్ కుటుంబం కానీ, ఇటు అనిరుధ్ వర్గాలు కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.





# పెద్ది విజయంపైనే రామ్‌చరణ్ ఆశలు

## బుచ్చిబాబు దర్శకత్వానికి కూడా సవాలే

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.... ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. అయితే ఆ తరువాత వచ్చిన సినిమాలు మాత్రం ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయాయి. దీంతో ఇప్పుడు చరణ్ కెరీర్‌లో రాబోయే రెండు ప్రాజెక్టులు అత్యంత కీలకంగా మారాయి. ఆచార్యలో కీలక పాత్ర పోషించినప్పటికీ ఆ చిత్రం ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అనంతరం భారీ అంచనాల మధ్య విడుదలైన గేమ్ ఛేంజర్ కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. స్టార్ దర్శకుడు, భారీ బ్జడెట్, భారీ తారాగణం ఉన్నప్పటికీ సినిమా ప్రేక్షకుల అంచనాలను పూర్తిగా అందుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు అభిమానుల ఆశలన్నీ చరణ్ తదుపరి చిత్రం 'పెద్ది'పై నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్, పాటలు, టీజర్‌లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా చరణ్ మాస్ లుక్, రగ్గడ్ బాడీ లాంగ్వేజ్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా కాలం తర్వాత ఆయనను పూర్తి స్థాయి మాస్ పాత్రలో చూడబోతున్నామనే అంచనాలు అభిమానుల్లో కనిపిస్తున్నాయి. బుచ్చిబాబు తన తొలి చిత్రం ఉప్పెన తోనే దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. భావోద్వేగాలను బలంగా తెరపై చూపించడంలో ఆయన ప్రత్యేక శైలి ఉందని సినీ విశ్లేషకులు చెబుతుంటారు. అదే ఎమోషనల్ టచ్ 'పెద్ది'లో కూడా కనిపించనుందనే టాక్ వినిపిస్తోంది. ఇక 'పెద్ది' తర్వాత చరణ్ చేయబోయే సినిమా మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎందుకంటే ఆ చిత్రానికి దర్శకత్వం వహించబోయేది సుకుమార్. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన రంగస్థలం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ముఖ్యంగా చిట్టిబాబు పాత్రలో చరణ్ నటనకు భారీ ప్రశంసలు వచ్చాయి. ఆ సినిమా ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. ఇప్పుడు మరోసారి అదే కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఒకవేళ 'పెద్ది' భారీ విజయాన్ని అందుకుంటే ఆయన మాస్ ఇమేజ్ మరింత బలపడే అవకాశం ఉంది. ఆ తర్వాత సుకుమార్ సినిమా కూడా విజయవంతమైతే గ్లోబల్ స్టార్‌గా ఆయన మార్కెట్ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అఖిల్ లెనిన్ టీజర్ విడుదల

## అక్కినేని అభిమానుల్లో ఉత్సాహం



అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే సినిమా అనౌన్స్‌మెంట్‌తో మంచి అంచనాలు ఏర్పడగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంగా, 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ ఎలిమెంట్స్ కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన చెప్పిన డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మనోడు వస్తున్నాడు? నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా? అంటూ అఖిల్ చెప్పిన డైలాగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ డైలాగుల్లో కనిపించిన యాటిట్యూడ్, స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక టీజర్ విడుదలపై నాగార్జున కూడా స్పందించారు. తనకు ఈ టీజర్ ఒక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. టీజర్ మొత్తం ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా అనిపించిందని అభిప్రాయపడ్డారు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న ఆయనకు 'లెనిన్' మంచి మైలురాయిగా మారుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ చూస్తుంటే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఆ వైరల్ వీడియో, ఫొటోలు నావి కావు..

## బాధ్యులపై లీగల్ యాక్షన్ తీసుకుంటా: రుక్మిణి వసంత్

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తన బికినీ ఫోటోషూట్ చిత్రాలపై నటి రుక్మిణి వసంత్ తీవ్రంగా స్పందించారు. ఆ చిత్రాలు పూర్తిగా నకిలీవని, ఏఐ టెక్నాలజీతో సృష్టించినవని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కొన్ని రోజులుగా, గ్రీన్ బికినీ ధరించి స్విమ్మింగ్ పూల్‌లోకి వెళుతున్నట్లుగా ఉన్న ఓ మహిళ ఫొటోలు, వీడియో క్లిప్‌లు ఆన్‌లైన్‌లో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. చాలామంది నెటిజన్లు ఇది రుక్మిణి వసంత్ 'మొదటి బికినీ షూట్' అంటూ ప్రచారం చేయడంతో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో రుక్మిణి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా దీనిపై పూర్తి వివరణ ఇచ్చారు. "నా పేరుతో సర్క్యులేట్ అవుతున్న కొన్ని ఏఐ-జనరేటెడ్ చిత్రాలు నా బృందం దృష్టికి వచ్చాయి. ఆ చిత్రాలు పూర్తిగా ఫేక్, కల్పితం అని నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. వాటికి నాకు ఎలాంటి సంబంధం లేదు" అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. ఇలాంటి నకిలీ కంటెంట్‌ను సృష్టించి, వ్యాప్తి చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని, ఇది వ్యక్తిగత గోప్యతా హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడమేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫేక్ చిత్రాలను రూపొందించి, వ్యాప్తి చేసిన వారిపై తన బృందం సైబర్ క్రైమ్, చట్టపరమైన చర్యలు ప్రారంభిస్తుందని రుక్మిణి తెలిపారు. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని ప్రోత్సహించవద్దని, ఆ కంటెంట్‌ను ఎవరూ షేర్ చేయవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ వివాదం పక్కన పెడితే, రుక్మిణి వసంత్ తన కెరీర్‌పై పూర్తి దృష్టి సారించారు. ఆమె ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ యశ్‌తో కలిసి 'టాక్సిక్' చిత్రంలో నటిస్తున్నారు. దీనితో పాటు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా చేస్తున్న 'డ్రాగన్' సినిమాలో కూడా ఆమె హీరోయిన్. ఇలా కెరీర్‌లో ప్రస్తుతం ఆమె వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.



# ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ఇష్టపడే పానీయం టీ.. అసలు ఎక్కడ ఎవరు తయారు చేశారు..

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది రోజును ఒక కప్పు టీతో ప్రారంభిస్తారు. భారతీయుల జీవితంలో చాయ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రపు చిట్‌చాట్‌ల వరకు టీ దైనందిన జీవితంలో భాగమైపోయింది. అయితే ఇప్పుడు భారతీయుల అభిమాన పానీయంగా మారిన టీ అసలు పుట్టింది మాత్రం భారత్‌లో కాదు. వేల సంవత్సరాల క్రితమే చైనాలో టీ చరిత్ర ప్రారంభమైంది. టీ ఆవిష్కరణకు సంబంధించిన కథ దాదాపు 5 వేల సంవత్సరాల క్రితం చైనాలోని యున్నాన్ ప్రాంతంతో ముడిపడి ఉంది. చారిత్రక కథనాల ప్రకారం చైనా చక్రవర్తి షెన్ నాంగ్ ఒక చెట్టు కింద కూర్చుని ఉండగా పక్కనే నీరు మరుగుతుండేది. ఆ సమయంలో చెట్టు ఆకులు కొన్ని ఆ వేడి నీటిలో పడిపోయాయి. ఆ నీటిని రుచి చూసిన చక్రవర్తి దాని ప్రత్యేక రుచి, ఉల్లాసాన్ని చూసి ఆశ్చర్యపోయాడట. దాన్నే ప్రపంచంలో తొలి టీ కప్పుగా భావిస్తారు.

### చైనాలో అలాగే తాగుతారు..

తర్వాత అనేక శతాబ్దాల పాటు చైనాలో టీని కేవలం పానీయంగా మాత్రమే కాకుండా ఔషధంగా కూడా భావించేవారు. టీ తాగితే మెదడు చురుకుగా పనిచేస్తుందని, జీర్ణక్రియ మెరుగుపడుతుందని, శరీరానికి శక్తి వస్తుందని అక్కడి ప్రజలు నమ్మేవారు. క్రమంగా టీ వారి దైనందిన జీవితంలో భాగమై, ఆ తర్వాత ప్రత్యేక కళారూపంగా కూడా మారింది. చైనాలో సాధారణంగా టీని పాలు, చక్కెర లేకుండా స్వచ్ఛమైన రూపంలోనే తాగుతారు. అలా తాగితే టీ ఆకుల సహజ రుచి పూర్తిగా ఆస్వాదించవచ్చని భావిస్తారు. చైనా వ్యాపారుల ద్వారా టీ యూరప్‌కు చేరింది. 17వ శతాబ్దానికి బ్రిటిష్ ప్రజలు టీకి బాగా అలవాటు పడ్డారు. అయితే టీ వ్యాపారంపై పూర్తిగా చైనాకే ఆధిపత్యం ఉండటంతో బ్రిటన్ కొత్త మార్గాలను వెతకడం ప్రారంభించింది. అదే సమయంలో భారత్‌లో టీ సాగు ప్రారంభమైంది.

### 20వ శతాబ్దంలో భారత్‌లోకి..

మొదట బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ చైనా టీ విత్తనాలను భారత్‌లో నాటే ప్రయత్నం చేసింది. కానీ అసలు మలుపు అస్సాంలో సహజంగా పెరుగుతున్న అడవి టీ మొక్కలను గుర్తించిన తర్వాత వచ్చింది. ఈ టీ రకం చైనా టీ మొక్కలకంటే భిన్నంగా ఉండేది. దీని ఆకులు పెద్దగా ఉండటంతో పాటు చక్కని రుచిని ఇస్తుండేవి. బ్లాక్ టీ తయారీకి ఇది ఎంతో అనుకూలంగా మారింది. ఆ తర్వాత అస్సాం, డార్జిలింగ్, నీలగిరి వంటి ప్రాంతాల్లో భారీ స్థాయిలో టీ తోటలు ఏర్పడ్డాయి. అయితే ప్రారంభంలో భారత్‌లో పండించిన టీ ఆకులను ఎక్కువగా విదేశాలకు ఎగుమతి చేసేవారు. భారతీయులు అప్పట్లో పెద్దగా టీ తాగేవారు కాదు. 20వ శతాబ్దంలో జరిగిన ప్రచార కార్యక్రమాల తర్వాతే టీ భారతీయ ఇళ్లలో సాధారణ పానీయంగా మారింది. టీని భారత్ పూర్తిగా కొత్త రూపంలో మార్చింది. చైనాలో స్వచ్ఛమైన టీకి ప్రాధాన్యం ఇస్తే, భారతీయులు అందులో పాలు, చక్కెర, అల్లం, యాలకులు, లవంగాలు వంటి మసాలాలు కలిపారు. అలా మసాలా చాయ్ అనే ప్రత్యేక రుచికరమైన పానీయం రూపుదిద్దుకుంది.

### భిన్న రకాల రుచులు..

చైనా టీ సాధారణంగా మృదువైన, సున్నితమైన రుచితో ఉండి నెమ్మదిగా ఆస్వాదించేందుకు అనుకూలంగా ఉంటుంది. భారతీయ టీ మాత్రం ఘాటుగా, బలమైన రుచితో వెంటనే ఉత్సాహాన్ని ఇచ్చేలా ఉంటుంది. టీ తాగే విధానంలో కూడా రెండు దేశాల మధ్య తేడా కనిపిస్తుంది. చైనాలో టీ తాగడం ప్రశాంతత, ధ్యానంతో ముడిపడి ఉంటే, భారత్‌లో టీ అనేది సంభాషణలతో ముడిపడి ఉంటుంది. కుటుంబ చర్చలు, ఆఫీస్ విరామాలు, రైలు ప్రయాణాలు, స్నేహితుల కబుర్లు అన్నింటిలోనూ చాయ్ ప్రత్యేక భాగంగా మారిపోయింది. టీ చైనాలో పుట్టినా, దానికి కొత్త వ్యక్తిత్వాన్ని ఇచ్చింది మాత్రం భారత్ అనే చెప్పాలి. వేల సంవత్సరాల క్రితం చైనా పర్వతాల్లో ప్రారంభమైన ఈ ప్రయాణం నేడు భారతీయుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది.

# వేసవిలో రోజూ పెరుగన్నం తినండి.. ఎన్నో అద్భుతమైన లాభాలను పొందవచ్చు..



వేసవికాలంలో శరీరానికి చల్లదనం ఇచ్చే ఆహారాలను తీసుకోవడానికి ప్రజలు ఎక్కువగా ఇష్టపడతారు. అలాంటి ఆహారాల్లో పెరుగన్నం ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తేలికగా జీర్ణమయ్యే ఈ సంప్రదాయ వంటకం వేడికాలంలో శరీరానికి ఉపశమనం కలిగించడమే కాకుండా పొట్టకు కూడా హాయిని ఇస్తుంది. అయితే రెండు వారాల పాటు ప్రతిరోజూ పెరుగన్నం తింటే శరీరంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయో తెలుసుకోవాలనే ఆసక్తి చాలామందిలో ఉంటుంది. నిపుణుల ప్రకారం, ఇది జీర్ణక్రియ నుంచి హైడ్రేషన్ వరకు పలు ప్రయోజనాలను అందిస్తుందని చెబుతున్నారు. పెరుగులో ఉండే ప్రోబయోటిక్స్ ఆరోగ్యకరమైన గట్ (జీర్ణ వ్యవస్థ) బ్యాక్టీరియాను పెంచడంలో సహాయపడతాయి. అందువల్ల పెరుగన్నం తరచూ తింటే జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు కడుపు ఉబ్బరం, ఆమ్లత్వం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. అన్నం మృదువుగా ఉండటం వల్ల వేసవిలో సులభంగా జీర్ణమవుతుంది. ఫెర్మెంటెడ్ ఫుడ్స్‌ను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం గట్ ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

### వేసవి సమస్యలను తగ్గిస్తుంది..

పెరుగన్నం సహజసిద్ధంగా శరీరానికి చల్లదనం అందించే ఆహారం. పెరుగులో నీటి శాతం ఎక్కువగా ఉండటంతోపాటు పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్స్ కూడా ఉంటాయి. ఇవి శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటంలో సహాయపడతాయి. వేసవిలో డీహైడ్రేషన్, అలసట సమస్యలను తగ్గించడంలో పెరుగన్నం ఉపయోగపడుతుందని చెబుతున్నారు. దోసకాయ, కరివేపాకు వంటి పదార్థాలు కలిపితే మరింత చల్లదనం లభిస్తుంది. అంతేకాకుండా అధిక మసాలా లేదా నూనెతో చేసిన వంటకాలతో పోలిస్తే పెరుగన్నం తేలికగా ఉంటుంది. అన్నంలో కార్బోహైడ్రేట్లు ఉండటం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. పెరుగులో ఉండే కొద్దిపాటి ప్రోటీన్, కొవ్వు కలిసి ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తాయి. దీనివల్ల మధ్యాహ్న సమయంలో అలసట తగ్గి శక్తి స్థాయిలు స్థిరంగా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

### రోగ నిరోధక శక్తికి..

పెరుగులోని ప్రోబయోటిక్స్ రోగనిరోధక శక్తిని కూడా బలోపేతం చేయడంలో సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. గట్ ఆరోగ్యం మెరుగుపడితే శరీర రక్షణ వ్యవస్థ కూడా మెరుగ్గా పనిచేస్తుందని చెబుతున్నారు. రెండు వారాల వ్యవధిలోనే కొంతమేర జీర్ణ సమస్యలు తగ్గినట్లు చాలామంది గమనించే అవకాశం ఉందని వివరిస్తున్నారు. అయితే ప్రతిరోజూ పెరుగన్నమే తినడం వల్ల పోషకాల వైవిధ్యం తగ్గే ప్రమాదం కూడా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెరుగన్నంలో ఐరన్, ఫైబర్ వంటి కొన్ని పోషకాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి కూరగాయలు, పప్పులు, పండ్లు వంటి ఇతర ఆహారాలను కూడా సమతులంగా తీసుకోవడం అవసరం. క్యారెట్ తురుము, దానిమ్మ గింజలు, వేయించిన గింజలు కలిపి తింటే ఈ వంటకం మరింత పోషకవంతంగా మారుతుంది.

### బరువు తగ్గేందుకు..

ఇక పెరుగన్నాన్ని సరైన మోతాదులో తీసుకుంటే బరువు నియంత్రణకు కూడా ఉపయోగపడుతుంది. ఇది ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంచి మధ్యలో అనవసరమైన స్నాక్స్ తినే అలవాటును తగ్గిస్తుంది. అయితే అన్నం ఎక్కువగా తీసుకుంటే క్యాలరీలు పెరిగే అవకాశం ఉండటంతో పరిమిత మోతాదులో తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో రెండు వారాల పాటు పెరుగన్నం తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం, జీర్ణక్రియలో మెరుగుదల, తేలికైన అనుభూతి వంటి ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంటుంది. అయితే సమతుల ఆహారంతోపాటు ఇతర పోషకాలు కూడా అందేలా జాగ్రత్తపడితేనే పూర్తి ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరిచే అద్భుతమైన పదార్థం



వేసవి కాలం కావడంతో శరీరానికి చల్లదనం ఇచ్చే ఆహారాలు, పానీయాల వినియోగం పెరుగుతోంది. శరీరానికి చల్లదనాన్ని ఇచ్చే సంప్రదాయ పదార్థాల్లో గోండ్ కతీరా కూడా ఒకటి. సహజసిద్ధమైన ఈ గమ్‌ను చాలామంది శర్బత్‌లు, మిఠాయిలు, కూలింగ్ డ్రింక్స్‌లో ఉపయోగిస్తుంటారు. శరీరాన్ని చల్లగా ఉంచడంలో, హైడ్రేషన్ మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుంది. అయితే గోండ్ కతీరాను సరైన సమయంలో, సరైన మోతాదులో తీసుకోవడం చాలా ముఖ్యమని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. పోషకాహార నిపుణుల ప్రకారం, గోండ్ కతీరాను ఉదయం ఖాళీ కడుపుతో లేదా మధ్యాహ్నానికి ముందు సమయంలో తీసుకోవడం ఉత్తమం. ముఖ్యంగా వేసవిలో దీనిని రోజులో తొందరగా తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం ఎక్కువగా అందుతుందని చెబుతున్నారు. రాత్రి సమయంలో లేదా అధిక మోతాదులో తీసుకుంటే జీర్ణక్రియ మందగించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారికి ఇది భారంగా అనిపిస్తుందని పేర్కొంటున్నారు.

### సరైన విధంగా నానబెట్టాలి..

గోండ్ కతీరా నీటిలో నానిన తర్వాత జెల్‌లా మారుతుంది. ఇదే దాని చల్లదనానికి ప్రధాన కారణం. అయితే ఈ జెల్ ఆకృతి కొందరిలో జీర్ణక్రియను నెమ్మదింపజేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే దీన్ని సరైన విధంగా తీసుకోవడం అవసరమని సూచిస్తున్నారు. గోండ్ కతీరాను తీసుకునే ముందు ఒకటి నుంచి రెండు టీ స్పూన్ల మోతాదులో రాత్రంతా నీటిలో నానబెట్టాలని సూచిస్తున్నారు. తరువాత తయారైన జెల్‌లో ఒకటి నుంచి రెండు టేబుల్ స్పూన్ల వరకు తీసుకోవచ్చు. దీన్ని తగినంత ద్రవాలతో కలిపి తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. అయితే పొడిగా నేరుగా తినకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే గోండ్ కతీరా అందరికీ ఒకేలా అనుకూలించదని కూడా నిపుణులు చెబుతున్నారు. కడుపు ఉబ్బరం, ఐబీఎస్, తరచుగా గ్యాస్ సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా తీసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే తక్కువ బీపీ ఉన్నవారు, ఇప్పటికే అధిక ఫైబర్ ఆహారం తీసుకునేవారు, జీర్ణక్రియ నెమ్మదిగా ఉండేవారు కూడా మోతాదుపై శ్రద్ధ పెట్టాలని చెబుతున్నారు. రోజంతా తక్కువ నీరు తాగే అలవాటు ఉన్నవారికి కూడా ఇది అసౌకర్యం కలిగించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

### భారీ భోజనం తరువాత వద్దు..

అనారోగ్యం నుంచి కోలుకుంటున్నవారు లేదా ఆకలి తక్కువగా ఉన్నవారు కూడా దీన్ని జాగ్రత్తగా తీసుకోవాలని సూచిస్తున్నారు. కొంతమంది మహిళలకు పీరియడ్స్ సమయంలో గోండ్ కతీరా తీసుకుంటే అధిక చల్లదనం కారణంగా అసౌకర్యంగా అనిపించే అవకాశం ఉంటుందని నిపుణులు వివరిస్తున్నారు. వ్యాయామానికి ముందు, భారీ భోజనం చేసిన వెంటనే లేదా మందులతో పాటు గోండ్ కతీరా తీసుకోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మందులు తీసుకునే సమయానికి గోండ్ కతీరా మధ్య కనీసం రెండు నుంచి మూడు గంటల గ్యాప్ ఉండాలని సూచిస్తున్నారు. సరైన మోతాదులో, సరైన సమయంలో తీసుకుంటే గోండ్ కతీరా వేసవిలో శరీరానికి చల్లదనం అందించే మంచి సహజ పదార్థంగా ఉపయోగపడుతుంది. అయితే వ్యక్తిగత జీర్ణక్రియ, నీటి వినియోగం, ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తీసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

# ఎండలు పెరుగుతున్న వేళ.. ఆయుష్ మంత్రిత్వ శాఖ సూచనలు..


దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుతున్న నేపథ్యంలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖతోపాటు ఆరోగ్య సేవల విభాగం ప్రజలకు కీలక సూచనలు జారీ చేసింది. తీవ్రమైన ఎండల ప్రభావం వల్ల డీహైడ్రేషన్, హీట్ ఎగ్జాస్షన్, కండరాల పట్టేయడం, మూర్ఛ, తీవ్రమైన పరిస్థితుల్లో హీట్‌స్ట్రోక్ వంటి ప్రాణాపాయ సమస్యలు తలెత్తే అవకాశముందని హెచ్చరించింది. ముఖ్యంగా తలనిర్బంధం, వాంతులు, తలనొప్పి, గందరగోళం, వేగంగా గుండె కొట్టుకోవడం, గాఢ పసుపు రంగు మూత్రం, అపస్మారక స్థితి వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించింది. వేసవిలో దాహం వేయకపోయినా తరచూ నీరు తాగడం చాలా ముఖ్యమని సూచించింది. దాహం లేకపోవడం అంటే శరీరానికి నీరు అవసరం లేదని కాదని స్పష్టం చేసింది. శరీరాన్ని చల్లగా ఉంచేందుకు ఇంట్లో తయారు చేసే సంప్రదాయ పానీయాలను తీసుకోవాలని సూచించింది.

### లస్సీ, కొబ్బరి నీళ్లు..

చాస్, లస్సీ వంటి పానీయాలు వేసవిలో శరీరాన్ని చల్లబరచడంలో ఎంతో ఉపయోగపడతాయని తెలిపింది. ఇవి శరీరానికి తేమను అందించడమే కాకుండా జీర్ణక్రియకు కూడా సహాయపడతాయని పేర్కొంది. కొబ్బరి నీరు సహజ ఎలక్ట్రోలైట్స్‌తో నిండిన ఉత్తమ పానీయంగా పేర్కొంది. ఇది శరీరంలో కోల్పోయిన ఖనిజాలను తిరిగి భర్తీ చేయడంలో సహాయపడుతుందని తెలిపింది. నిమ్మరసం వేసవిలో అత్యంత సులభమైన, ప్రభావవంతమైన పానీయమని సూచించింది. కొద్దిగా ఉప్పు కలిపి తీసుకుంటే శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుతుందని పేర్కొంది. సత్తు పానీయం కూడా వేసవిలో శక్తిని ఇచ్చే చల్లని పానీయంగా సూచించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉపయోగించే ఈ పానీయం శరీర వేడిని తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపింది. అలాగే ఆమ్ పన్నా శరీర ఉష్ణోగ్రతను తగ్గించి చెమట ద్వారా కోల్పోయిన లవణాలను భర్తీ చేస్తుందని పేర్కొంది. హీట్ ఎగ్జాస్షన్ నివారణలో ఇది ఉపయోగకరమని తెలిపింది. బేల్ శర్బత్‌ను సహజ శీతల పానీయంగా వివరించింది. ఇది శరీరానికి చల్లదనాన్ని అందించడంలో సహాయపడుతుందని పేర్కొంది.

### మజ్జిగ, పుచ్చకాయ..

ఇక దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన నన్నారి పానకం కూడా వేసవిలో ఉపయోగకరమైన పానీయమని తెలిపింది. నన్నారి సిరప్, నిమ్మరసం, సబ్జా గింజలు కలిపి తయారుచేసే ఈ పానీయం శరీరాన్ని తాజాగా ఉంచుతుందని పేర్కొంది. మజ్జిగలో ఉసిరికాయ, కరివేపాకు, అల్లం, సేంద్రీయ ఉప్పు కలిపి తయారు చేసే గూస్‌బెర్రీ బటర్‌మిల్క్ కూడా శరీరానికి చల్లదనాన్ని అందిస్తుందని సూచించింది. వేసవిలో ఎక్కువ నీటి శాతం ఉన్న పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించింది. పుచ్చకాయ శరీరాన్ని వెంటనే చల్లబరచడంలో సహాయపడుతుందని తెలిపింది. తర్బూజా



కూడా శరీరానికి తేమను అందించే ఉత్తమ పండుగా పేర్కొంది. దోసకాయను సలాడ్, రైతా లేదా నేరుగా ఉప్పుతో తీసుకోవచ్చని, ఇది శరీర ఉష్ణోగ్రతను తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపింది.

### ద్రాక్ష, కూరగాయలు..

ద్రాక్షలో సహజ చక్కెరలు, నీటి శాతం అధికంగా ఉండటంతో శక్తిని నిలబెట్టడంలో ఉపయోగపడుతుందని పేర్కొంది. కొబ్బరి బొండంలోని మృదువైన తురుము కూడా శరీరానికి చల్లదనాన్ని అందించే పోషకాహారంగా సూచించింది. బూడిద గుమ్మడికాయను ఆయుర్వేదం, సిద్ధ వైద్యంలో చల్లదనాన్ని ఇచ్చే ఆహారంగా భావిస్తారని తెలిపింది. దీన్ని వంటల్లో లేదా పానీయాల రూపంలో తీసుకోవచ్చని సూచించింది. టమాటాలు, లెట్యూస్ వంటి నీటి శాతం అధికంగా ఉండే కూరగాయలను తేలికపాటి ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించింది. అలాగే తీవ్రమైన ఎండల సమయంలో మద్యం, అధిక టీ, కాఫీ, కార్బొనేటెడ్ శీతల పానీయాలు, అధిక చక్కెర కలిగిన డ్రింక్స్, ఎక్కువ నూనెతో చేసిన వంటకాలు, అధిక ప్రోటీన్ ఆహారాలను తగ్గించాలని హెచ్చరించింది. ఇవి శరీరంలో వేడిని పెంచి డీహైడ్రేషన్ సమస్యను మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉందని తెలిపింది. సాంప్రదాయ భారతీయ వేసవి ఆహారాలు, పానీయాలు ప్రస్తుత కాలంలో మరింత అవసరమని ఈ మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి.

# యుద్ధ ప్రాతిపదికన ధాన్యం తరలింపు: కలెక్టర్ చిత్రా మిశ్రా



## కొనుగోలు కేంద్రాల పరిశీలనలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీపీ గౌష్ ఆలం



కరీంనగర్, మే 24: జిల్లాలో ధాన్యం కొనుగోలు, తరలింపు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా ధాన్యం లిఫ్టింగ్ చేపట్టి మిల్లులకు తరలిస్తున్నామని పేర్కొన్నారు. శనివారం రాత్రి గంగాధర మండలంలోని మధుర్‌నగర్, నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, పెండింగ్ ధాన్యం, లారీల అవసరం, రైతుల సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మేరకు లారీలను అందుబాటులోకి తీసుకువచ్చి ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గన్నీ బ్యాగుల సరఫరా, లోడింగ్-అన్‌లోడింగ్ పనులపై కూడా సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. అనంతరం గంగాధరలోని గోదాంను పరిశీలించిన అధికారులు నిల్వ సామర్థ్యంపై వివరాలు తెలుసుకున్నారు. గట్టు బూత్కూర్‌లోని రైస్ మిల్లును కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగారావు, డీఎం రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రాత్రివేళ రైస్‌మిల్లులో కలెక్టర్, సీపీ ఆకస్మిక తనిఖీ

## బీహార్ వలస కూలీలతో నేరుగా మాట్లాడిన అధికారులు

కరీంనగర్, మే 24: గంగాధర మండలం గట్టుబూత్కూర్‌లోని జానకిరామ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించిన అధికారులు అక్కడ పనిచేస్తున్న బీహార్‌కు చెందిన వలస కూలీలతో ప్రత్యేకంగా మాట్లాడారు. రోజువారీ కూలి, పని గంటలు, వసతి, కుటుంబ పరిస్థితులు, ఇతర ఇబ్బందులపై నేరుగా ఆరా తీశారు. కూలీల జీవన పరిస్థితులపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రైస్‌మిల్లులో పనిచేస్తున్న కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతం చేసేందుకు అదనపు కూలీలను ఏర్పాటు చేసుకోవాలని మిల్లర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, సీఐ ప్రదీప్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, డీఎం రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

## ప్రజా ప్రభుత్వ లక్ష్యాలపై విస్తృత అవగాహన కల్పించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా




కరీంనగర్, మే 24: ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మహిళా, శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, మెప్మా శాఖల అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మే 25న పోషకాహార మిషన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహార వంటకాల ప్రదర్శనలు, జంక్ ఫుడ్‌పై అవగాహన, గర్భిణీలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 26న బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు, పోస్టర్లు, గోడలపై చిత్రలేఖనం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మహిళల భద్రత, షీ టీమ్స్ సమన్వయం, కార్యాలయాల్లో ౹ాూా౦ నిబంధనల అమలుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యులకు లోన్ మేళా నిర్వహించాలని సూచించారు.

మే 29న కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, వీఓ భవనాలు ప్రారంభించడంతో పాటు వేములవాడలో మెప్మా క్యాంటీన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. మే 30న "అమ్మ మాట -- అంగన్‌వాడి బాట" కార్యక్రమం నిర్వహించి ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు పాఠశాల ప్రవేశానికి సర్టిఫికెట్లు అందజేయాలని సూచించారు

ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూపరాణి, డీఆర్‌డీఏ పీడీ గీత, డీపీఓ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో అత్యున్నత ప్రమాణాలు పాటించాలి: ఏసీపీ ప్రతాప్

## కరీంనగర్ కమీషనరేట్‌లో ఏఆర్ సిబ్బందితో సమీక్షా సమావేశం

కరీంనగర్, మే 23: ప్రజాప్రతినిధులు, వీఐపీల భద్రతతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో పీఎస్‌ఓలు, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించాలని కరీంనగర్ ఏఆర్ ఏసీపీ ప్రతాప్ సూచించారు. శనివారం కరీంనగర్ కమీషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రామాణిక విధానాలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పీఎస్‌ఓలు వీఐపీల భద్రతను ప్రథమ కర్తవ్యంగా భావించి ఆయుధాల నిర్వహణ, రూట్ చెకింగ్, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. బాంబ్ డిస్పోజల్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం, సమయస్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. డాగ్ స్క్వాడ్ హ్యాండ్లర్లు శునకాల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణే విజయానికి మూలమని, ప్రజల భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఏసీపీ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రిజర్వు ఇన్స్పెక్టర్ రజినీకాంత్, ఆర్ఎస్సైలు నీలవేణి రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

## ముస్లిం సోదరులకు ఇబ్బందులు లేకుండా చర్యలు: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్, మే 24: బక్రీద్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. శనివారం రాత్రి పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి కరీంనగర్ రేకుర్తి సాలేనగర్‌లో బక్రీద్ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యే భక్తుల సంఖ్య, అవసరమైన సౌకర్యాలపై అధికారులు, ముస్లిం మత పెద్దలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ, మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి అవసరమైన వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ముస్లిం మత పెద్దలు విద్యుత్ సరఫరా, కూలర్లు, లైటింగ్, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటుపై అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్వర్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# 40వ డివిజన్‌లో డ్రైన్, కల్వర్ట్ నిర్మాణ పనులకు భూమిపూజ

## నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, మే 24: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 40వ డివిజన్‌లో రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైన్, కల్వర్ట్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి డివిజన్‌లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఈ కల్వర్ట్ నిర్మాణం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ నలువాల పుష్పలత రవీందర్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

# వీరశైవ లింగాయత్ ప్రజాప్రతినిధులకు జగద్గురువుల ఘన సత్కారం



చిగురుమామిడి, జనత న్యూస్: అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించిన సత్కార కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన వీరశైవ లింగాయత్ ప్రజాప్రతినిధులను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ 1008 కాశీ జగద్గురువుల ఉత్తరాధికారి శివశ్రీ మల్లికార్జున శివాచార్య మహాస్వామి వారు సర్పంచులు, మున్సిపల్ చైర్మెన్లు, కౌన్సిలర్లు, ఉపసర్పంచులకు ఆశీర్వచనాలు అందించి ఘనంగా సత్కరించారు. సమాజ సేవతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా చిగురుమామిడి గ్రామ సర్పంచ్ ఆకవరం భవానీ శివప్రసాద్ కి జగద్గురువు నుండి సన్మానం, ఆశీర్వాదాలు అందుకున్నారు. అదేవిధంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన వీరశైవ లింగాయత్ సమాజానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు హాజరై సమాజ ఐక్యత, అభివృద్ధికి కృషి చేయాలని సంకల్పించారు. వీరశైవ లింగాయత్ సమాజ అభ్యున్నతి, యువతలో సేవా భావం పెంపొందించడం, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించడం లక్ష్యంగా మహాసభ పనిచేస్తోందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సమాజ పెద్దలు, యువ నాయకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇతర రాష్ట్రాల కార్మికుల వివరాల నమోదు ప్రారంభం

## కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్





కొత్తపల్లి, కరీంనగర్, మే 23: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణను మరింత బలోపేతం చేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల వివరాల నమోదు ప్రక్రియను ప్రారంభించినట్లు కొత్తపల్లి ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో నేపాల్, బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చి స్థానికంగా నివసిస్తున్న కార్మికుల వ్యక్తిగత వివరాలు, నివాస చిరునామాలు, ఉపాధి వివరాలను సేకరించి ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా స్టేషన్ హౌస్ అధికారి ట్రైనీ ఐపీఎస్ సోహం సునిల్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన కోసం ఈ నమోదు ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని కార్మికులకు అవగాహన కల్పిస్తూ వారి వివరాలను నమోదు చేశారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com